# దర్పణం

జనవరి - ఫిబ్రవరి 2009

తెలుగు భాషా, సాహితీ, సంస్కృతి, కళల, క్రీడల వార్తా విశేషాలు..

ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

The Bombay Andhra Mahasabha & Gymkhana



## గాన కోకిలకు ఘన సన్మానం ..

ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా
The Bombay Andhra Mahasabha & Gymkhana
10-C, Lakhamsi Napoo Road, Dadar (E), Mumbai - 400014. Tel. 24144377 / 24144388, Fax: 24119832.

✷ సారథ్యం : మూల సిద్ధారెడ్డి ✷ ప్రధాన సంపాదకులు : భోగ సహదేవ్

ఈవెంట్ మేనేజర్స్ : మట్టి జనార్దన్, కె. భాస్కర్ రెడ్డి, డా॥ విజయ సారథి, బి. ఎస్.రావు (శేషు)

సహసంపాదకులు : నడిమెట్ల యెల్లప్ప, గట్టు నర్సయ్య, దాస చంద్రకాంత్, శ్రీమతి టి. కమల కుమారి

సమన్వయ సంపాదకులు : సంగెవేని రవీంద్ర

## మా మాట

**న**మస్కారం!

**తె**లుగు భాషా సాహితీ సంస్కృతుల వికాసానికై మేము నిర్వహిస్తున్న కార్యక్రమాల పట్ల మీరు చూయిస్తున్న ఆదరణ మాలో మరింత బాధ్యతను పెంచుతోంది. మీ ఆదరణను మేము ఆశీస్సులుగా భావించి శిరసావహిస్తున్నాము. ముమ్ముందు మరిన్ని ఉత్తమ స్థాయి కార్యక్రమాల్ని నిర్వహించేందుకు మాకు ప్రేరణ కలిగిస్తున్న మీ అందరికీ మనసా వాచా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

అన్నట్లుగానే దర్పణాన్ని అనుకున్న సమయానికి మొదటి వారంలోనే మీకు అందిస్తున్నాం. గత దర్పణం పట్ల మీరు చూయించిన స్పందన మాలో నూతనోత్సాహాన్ని కలిగించింది. కాకుంటే మీతో మరొక్కసారి ఓ విషయం మనవి చేయ అనుకుంటుంన్నాం. దర్పణాన్ని మాస పత్రికగా భావించి మీ రచనలను పంపి మీలోని సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకోవాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం.

నగరంలో తెలుగు భాషను పరిరక్షించుకునే యజ్ఞంలో మీరు మీవంతు భాగస్వాములు కావాలని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. మీరు పంపే రచనలు మిమ్మల్ని రచయితగా మన స్వరాష్ట్రంలోని సాహితీ ప్రపంచానికి పరిచయం చేస్తాయి. అందుకు దర్పణం మీకు సహకరించ గలదు. అంతేగాదు.. ముంబైలోని తెలుగు రచయితలు ఎవ్వరికీ తీసిపోరనీ, పర ప్రాంతంలో కూడా తెలుగును పరిరక్షించుకుంటున్నారనే కీర్తి కూడా మనకు లభిస్తుంది.

మరింకెందుకు ఆలస్యం..? మీ కలానికి పదును పెట్టండి.. మీలో ఓ శ్రీశ్రీ, విశ్వనాథ, కాళోజీ, యండమూరి, యద్దనపూడి ఉండిఉండొచ్చు. రాయండి.. మీరు బాగా రాస్తారనీ, రాయాలనీ మేం ఆకాంక్షిస్తున్నాం. అలాగే మహాసభ కార్యక్రమాల పట్ల కూడా మీ సూచనలను, సలహాలను మాకు అందించండి. సాధ్యమైనంత వరకు మీ అభిరుచులకు తగ్గ కార్యక్రమాల్ని రూపొందించేందుకు ప్రయత్నిస్తామనీ మరొక్క సారి మీకు మనవి చేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాం.

ధన్యవాదములు...

**మూల సిద్ధారెడ్డి**
అధ్యక్షుడు

**భోగ సహదేవ్**
ప్రధాన కార్యదర్శి

ఇందులో...

- స్పందనలు..
- జరిగిన కార్యక్రమాలు
- జరుగబోవు కార్యక్రమాలు
- కవితలు, కథలు
- బాల దర్పణం
- హాస్యవల్లరి
- వింతలు విశేషాలు
- ప్రత్యేక వ్యాసాలు

ఇంకా.. ఎన్నో... ఎన్నెన్నో...

Designed and Printed : Spark Offset , 0986978629



# గతమాసపు దర్పణం పై పాఠకుల స్పందన..

### చాలా బాగుంది

డిసెంబర్ నెల దర్పణం అందింది. చాలా బాగుంది. ఈ నెల ప్రచురించిన కథలు సంచికకే హైలెట్‌గా ఉన్నాయి. ముమ్ముందు కూడా సభా కార్యక్రమాల వివరాలతో పాటు గొప్ప కథలు,కవితలు ప్రచురిస్తూ ఉండగలరని మనవి. ముంబయిలోని వర్ధమాన తెలుగు రచయితల రచనలకు ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని నా సలహా.

సంపాదక వర్గానికి అభినందనలు..

.. వేముల లక్ష్మి

### కొత్త శీర్షికలు ఉండాలి..

డిసెంబర్ సంచిక నిర్దిష్ట సమయంలో అందినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ మాసం కవిత ఆలోచించేలా ఉంది. జోకులు కూడా బాగుంటున్నాయి. కొత్తకొత్త శీర్షికలను ప్రవేశ పెట్టాలని కోరుతున్నాం. గ్లోబల్ వార్మింగ్ లాంటి సమకాలీన అంశాలపై వ్యాసాలు ప్రచురించాలని మనవి. దర్పణాన్ని సంపూర్ణ మాస పత్రికలా తీర్చిదిద్దుతున్నందుకు ప్రధాన సంపాదకులు సహదేవ్ గార్కి ధన్యవాదములు.

.. దాస గీత

### ఆకట్టుకునేలా ఉంది.

గత నెల దర్పణంలో ప్రచురించిన రమణీమణీయం మహిళాలోకాన్ని ఆకట్టుకునేలా ఉంది. మహిళలపై సామెతలు, ప్రస్తుత సందర్భంలో వాటి వివరణలు విజ్ఞానదాయకంగా ఉన్నాయి. దర్పణం సకుటుంబ మాస పత్రికలా ఇంటిల్లి పాదిని ఆకట్టుకుంటోంది. రానున్న కాలంలో కూడా దర్పణాన్ని ఇంకాఇంకా వైవిధ్య భరితంగా తీర్చి దిద్దాలని కోరుకుంటున్నాము. పత్రిక అవుట్‌లుక్ మరియు ముద్రణ చాలా బాగుంది. కార్య నిర్వాహ వర్గానికి, సంపాదక వర్గానికి నా అభినందనలు.

.. నడిమెట్ల భారతి

### కంటిన్యూ చేయాలి

డిసెంబర్ సంచికల్లో ప్రచురించిన 'ఒక్కడే ప్రజాకవి' అనే ఎండ్లూరి సుధాకర్ రాసిన వ్యాసం చాలా గొప్పగా ఉంది. సమాజంలోని అన్ని వర్గాలకు వర్తించే విధంగా దర్పణాన్ని తీసుకొస్తున్న మీ సాహసానికి జోహార్లు. వి.పి.చందన్‌రావు గారి కవిత సిరిసిల్లాలి చేనేత వర్ధిల్లాలి. అనే కవితా స్ఫూర్తిదాయకంగా ఉంది. దర్పణం కేవలం ఆంధ్ర మహాసభ సమాచార పత్రికలా కాకుండా పరిపూర్ణ మాస పత్రికలా ఉంటోంది. దీన్ని ఇలాగే కంటిన్యూ చేయాలని మనసార కోరుకుటున్నాము.

.. మర్రి విజయ

కవిత

ఈ మాసం కవిత

### సవాల్...

శూన్యంలో
ఒక అద్భుత దృశ్యాన్ని
ఆవిష్కరించాలి
ఎంత కష్టం
చేతిలోంచి జారిపోయిన
బంగారు చేప
సముద్రంలో కలిసిపోతే వెతకడం
ఎంత దుర్భేద్యం
అయినా వెంటపడి వేటాడి
మృగాన్ని కొట్టాలి
అది అడవి
ఒక దారిలేదు
ఒక దిక్కులేదు
అసలు
ఈ భూమ్మీద
పోరాటానికి సిద్ధంకావడమే
ఒక సవాల్.

- కందుకూరి శ్రీరాములు



# దర్పణం లో రేపటి కార్యక్రమాలు

## తేది 08/02/2009 ఆదివారం సా॥ 6.00 గం॥లకు. పద్మభూషణ్ పి. సుశీలకు సన్మానం




**గా**న కోకిల, పద్మభూషణ్ అవార్డు గ్రహీత శ్రీమతి పి. సుశీల గార్కి చెంబూర్‌లోని ఫైన్ ఆర్ట్స్ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు ఆత్మీయ సన్మానం ఉంటుంది. దేశభాషలన్నింటిలో ఎన్నో అవిస్మరణీయ పాటలతో మేధావులతో పాటు పామరులను కూడా అలరించిన శ్రీమతి పి. సుశీల గారు ఆంధ్ర మహాసభ వారి ఆహ్వానాన్ని మన్నించి ముంబైకి రావడం మనందరికీ ఎంతో గర్వకారణం. సన్మానానికి ముందు ప్రముఖ గాయని శ్రీమతి టి. రాధిక గారి అధ్వర్యంలో మురళి అండ్ బృందం వారి తెలుగు గానలహరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న ఈ కార్యక్రమానికి తెలుగు ప్రజలు భారీ సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా మనవి.

**నోట్:-**

**ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రవేశ పాసులకోసం ఆంధ్ర మహాసభ కార్యాలయంలో ఉదయం 9.00గ॥ల నుండి మ॥1.00 వరకు మళ్లీ సా॥ 4.00 గ॥ల నుండి రాత్రి 9.00ల వరకు సంప్రదించ గలరు. ఏవేని ఇబ్బందులు కలిగిన కార్యనిర్వాహక సభ్యులను లేక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సంప్రదించ గలరు. ప్రవేశ పాసులు లేని వారికి హాల్‌లో అనుమతి లభించబడదు. పాసులు లేకుండా హాలు వద్దకు వచ్చి నిరాశ పడ వద్దని సవినయంగా మనవి చేస్తున్నాం. డిసెంబర్ దర్పణంలో ప్రచురించిన పాస్ కూడా అనుమతించ బడును. కానీ, దాని జెరాక్స్ కాపీలు అనుమతించబడవు. దయచేసి హాలులో కేటాయించిన సీట్లలోనే కూర్చోవాలని వాగ్వివాదాలకు చోటివ్వకూడదని మరొక్కసారి మీ అందరికీ మనవి చేస్తున్నాం. సహృదయంతో సహకరించ గలరని ప్రార్థన**

## మహిళా శాఖ కార్యక్రమాలు

**ఎ**న్నడూలేని విధంగా మహిళా శాఖ వారు ఎంతో ఉత్సాహంగా, చురుగ్గా మేలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారు నిర్వహింపనున్న కార్యక్రమాలు క్రమక్రమంగా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. వారు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా మరికొన్ని కార్యక్రమాలు ఈ కింద సూచించిన విధంగా ఉన్నాయి.




**తే**ది 16,17 ఫిబ్రవరి రెండు రోజులు మహిళల కోసం అడ్డాట, రమ్మీ తదితర గేమ్స్ నిర్వహిస్తున్నారు. మ॥1.30 గ॥ల నుండి సా॥ 6.00 గ॥ల వరకు సాగే ఈ ఆటల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన వలసిందిగా మహిళా శాఖ అధ్యక్షురాలు శ్రీమతి టి. కమలకుమారి మరియు కార్యదర్శి శ్రీమతి వాణిరావు మనవి చేస్తున్నారు.



తేది 22 ఫిబ్రవరి నాడు మహిళా శాఖ అధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. సా॥3.30 గ॥ల నుండి 5.30 గ॥ల వరకు ఈ కార్యక్రమం జరుగనుంది.

తేది 8 మార్చి నాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా వైవిధ్య భరితమైన కార్యక్రమాలు నిర్వహించనున్నామని వారు తెలిపారు. మహిళా శాఖ వారు. నిర్వహించే కార్యక్రమాలలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు ప్రత్యేకంగా కోరారు.



**తేది 08/03/2009 ఆదివారం సా॥ 6.00 గం॥లకు. ప్రజా గాయకుడు వంగపండు ప్రసాదరావుకు ఘన సన్మానం**



"ఏం పిల్లడో ఎల్దామొస్తవా..సీకాకుళంలో సీమకొండకు.. ఏం పిల్లడో ఏల్దామొస్తవా..." అంటూ తెలుగు రాష్ట్రంలో ఉత్తేజాన్ని నింపిన కవిని పరిచయం చేయాల్సిన అవసరం లేదు.

జానపదబాణీలో కట్టిన ఈ పాట దశాబ్దాలుగా ప్రతి తెలుగోడి నోటిలో ఎక్కడో ఓ చోట నానుతూనే ఉంది. జానపద పాటను పట్టి, తెలంగాణ సాయుధపోరాటానికి గొంతిచ్చిన ఆ పాట వంగపండు ప్రసాదరావుది. భూమిభాగోతం నృత్యరూపకంతో రికార్డు సృష్టించిన వంగపండుకు బొల్లిముంత శివరామకృష్ణ స్మారక అవార్డు కూడా లభించింది.

విజయనగరం జిల్లా, పార్వతీపురం పక్కనున్న పెదబొండంపల్లి ఊరుకు చెందిన వంగపండుకు మొదటినుండి జానపదుల జీవన శైలిని పరిశీలించడం, వారి ఆచారవ్యవహారాలను గమనించడం అంటే ఎంతో ఆసక్తి. 8వ తరగతిలోనే 'వందనం.. జై ఆంధ్రమాత..' అనే పాటను రాసి కవిగా తొలిమెట్టు ఎక్కాడు.

శ్రీశ్రీని, సినారేను ఆదర్శంగా తీసుకున్నాడు. 'వత్తన్నాడు..వత్తన్నాడు.. ఆ భూములున్న బుడతోడు..' అనే పాటను శ్రీశ్రీ ముందు పాడి మెప్పుపొందాడు. జననాట్యమండలిలో చేరిన వంగపండు పాట ప్రభంజనమై ఉత్తరాంధ్ర, తెలంగాణ ప్రాంతాల్ని ఉగ్రూతలూగించింది.

'యంత్రమెట్ట నడుస్తువుందంటే.. ఓరన్నోలమ్మీ... రైలు కారు లారీ బస్సు మిల్లు మిసిను మోటారుసైకిలు..యంత్రమెట్ల నడుస్తు వుందంటే.. ' అనే పాట స్వరాష్ట్రంలోనే కాదు.. ముంబై కార్మికుల్లోకూడా ఉత్తేజాన్ని నింపింది. అలాంటి వంగపండు మన ఆంధ్రమహాసభకు రానున్నాడు. నగరంలో ఉంటున్న అన్ని వర్గాల జనాన్ని అలరించేందుకు అను నిత్యం కృషిచేస్తున్న మహాసభ నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాల్లో భాగంగా వంగపండును మహాసభకు ఆహ్వానిస్తున్నాం. చూసేందుకు సాధారణంగా కనిపించే ఈ అసాధారణ కవిని మొదటిసారి మహాసభకు రప్పిస్తున్న ఘనత కూడా మనదే..

మార్చి 8 నాడు నిర్వహించే వంగపండు కార్యక్రమానికి జానపద, జనపదుల పై అభిమానమున్న ప్రతి తెలుగువాడు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ మనసారా కోరుకుంటున్నాం.

**అందుకే తాగుతున్నా..**

'సిగరెట్ తాగేవాళ్లకంటే వారి పక్కనున్న వారికే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయనీ వైద్యులు చెబుతున్నారు.. తెలుసా..?' ప్రశ్నించింది భార్య చైన్ స్మోకర్ అయిన తన భర్తని..

'అందుకేగా నేను తాగేది' అన్నాడు భర్త తాపీగా భార్యపైకి పొగవదులుతూ.. !

**మొక్కుకున్నా..**

టికెట్ కలెక్టర్ అందరి వద్ద టికెట్ చెక్ చేస్తూ.. 'నీ టికెట్ ఏదీ..?' అని అడిగాడు వెంగళప్పని.. దానికాయన... 'సార్.. టికెట్ లేకుండా తిరుపతికి వస్తాననీ మొక్కుకున్నాను.. అందుకే టికెట్ తీయలేదన్నాడు తాపీగా...

**కలం పేరుతో..**


**వెంకి:** రచయిత నాగేశ్‌ని పోలీసులు అరెస్టు చేశారట..

**శ్రీను:** ఏం..! ఎందుకనీ..?

**వెంకి:** అసలు పేరుతో ఒక పెళ్లి, కలం పేరుతో మరో పెళ్లి చేసుకున్నాడట..

# చిన్న కథ

## హవ్వ!..



ఆరోజు ఆడిట్.

పదో గంటకల్లా ఆఫీసులో ఉండాలన్నాడు బాస్. గబ గబా నాలుగు మెతుకులు కతికి బస్టాఫ్‌కు బయలుదేరాను.


త్రోవలో రోడ్డు మీద స్పృహలేకుండా పడున్న వృద్ధుడొకడు కంటబడ్డాడు. ఎవరూ అతడిని గమనించినట్లు లేదు. చుక్క ఎక్కువైనట్లుందనుకున్నారు కొందరు. మరి కొందరు ఆ వ్యక్తి చనిపోయాడు కాబోలనుకుని 'పాపం' అంటూ చిల్లర విదిల్చి తమ సానుభూతిని కనబరుస్తున్నారు.

తమరు దయగల బాబుల్లా ఉన్నారు. అంతా అనుకుంటున్నట్లు అతడు చనిపోలేదు. శోషొచ్చి పడిపోయాడు. మీరో చెయ్యివేస్తే ఇంటికి చేర్చవచ్చు అన్నాడో ఆటోవాడు దగ్గరకొచ్చి.

'నీకు ఇతను తెలుసా?' అడిగాను. తెలుసునన్నట్లు తల పంకించాడు ఆటోవాడు.

వెంటనే నా వాటర్ బాటిల్ తెరచి అతడి మోహం మీద నీళ్లు చిలకరించాను. దాంతో అతడిలో కాస్త చలనం వచ్చింది. ఇరువురం కలిసి ఆ వృద్ధున్ని మెల్లగా లేవనెత్తి ఆటోలో కూర్చోబెట్టి నేనూ పక్కన కూర్చున్నాను.

రోడ్డు మీద పడున్న చిల్లర ఏరి జేబులో కుక్కుకున్నాడు ఆటోవాడు. వాడు చేస్తున్న పని నాకు నచ్చలేదు. అయినా నాకెందుకొచ్చిందిలే అనుకుని నోరు మూసుకున్నాను.



ఊరవతల చిన్నపాక ముందు ఆగింది ఆటో. డ్రైవర్, నేను కలిసి ఆ ముసలాణ్ణి జాగ్రత్తగా నడిపించుకుంటూ లోపలకు తీసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టాం.

"తాత!' అంటూ ఏడుపు మొహం పెట్టాడు అక్కడున్న ఏడేళ్ళ కుర్రాడు.

ఆ పసివాణ్ణి చూస్తే నాకు జాలివేసింది.

"భయపడకు మీ తాతకు ఏం కాదు. ఎండకి శోషొచ్చి పడిపోయాడంతే" అన్నాను ఊరడింపుగా.

అంతలో ఆటోవాడు నా వంక చూసి "బాబూ! చార్జి చెల్లిస్తే వెళ్లిపోతాను" అన్నాడు ఎంతో వినయంగా.

"ఈయన నాకేమైనా బంధువా? నువ్వు సాయం చెయ్యమంటే చేసాను. డబ్బులు అడుగుతావేంటీ?" అన్నాను వాడి మాటకు విస్తుపోతూ.

"ఇది మరీ బావుంది. ఆ ముసలాడు నాకు గాని చుట్టమనుకుంటున్నావా? అదేం కుదర్దు. మీ ఇద్దర్నీ నాలుగు మైళ్ళు లాక్కొచ్చాను. బండికి పెట్రోలు ఎవరు పోస్తారనుకుంటున్నావ్? మర్యాదగా వంద రూపాయలిచ్చి మరీ కదులు" అన్నాడు ఆటోవాడు.

వాడి నీచబుద్ధికి చీదరించుకుంటూ జేబులో నుంచి వంద కాగితం తీసి వాడి చేతిలో పెట్టాను.

వెళ్ళిపోయాడు ఆటోవాడు.

"ఎందుకైనా అవసరం ఉండొచ్చు ఈ డబ్బు ఉంచు" యాభై కాగితం ఒకటి తీసి పిల్లాడి చేతిలో పెట్టి వెనుదిరిగాను.

నెల రోజుల తర్వాత....

ఓ ఆదివారం ప్రదీప్‌నగర్‌లో ఉంటున్న మిత్రుణ్ణి కలిసి తిరిగొస్తుండగా త్రోవలో ఒకచోట జనం గుమిగూడి ఉండటం గమనించాను.

యాక్సిడెంటు కాబోలనుకుని అక్కడ మూగివున్న జనాన్ని ప్రక్కకు త్రోసి ముందుకెళ్ళి చూసాను.

ఆశ్చర్యం...

నేను ఆ రోజు చూసిన వృద్ధుడే అక్కడ చలనం లేకుండా పడి ఉన్నాడు. అక్కడ చేరిన వారంతా అతడిపై సానుభూతి కురిపిస్తున్నారు. తమకు తోచిన విధంగా డబ్బులేస్తున్నారు.

అంతలో ఓ ఆటోవాడొచ్చి “ఈయన చనిపోలేదు. ఎండకు సొమ్మసిల్లి పోయాడు మీలో ఎవరైనా తోడొస్తే ఇతడిని ఇంటికి చేర్చవచ్చు” అన్నాడు అతడిపై సానుభూతి కురిపిస్తూ....

ఆ ఆటోవాడు ఎవరో కాదు ఇదివరలో నన్ను మోసం చేసి వంద రూపాయలు గుంజుకెళ్ళిన వ్యక్తే. సీను అర్ధమైపోయింది.

గభాలున వెళ్ళి ముసలాడి రెక్కపుచ్చుకుని ‘రాస్కెల్, ఇంత వయసొచ్చి డబ్బు కోసం వెధవ్వేషాలు వేయడానికి సిగ్గు లేదూ...! ఇంతకంటే అడుక్కోవడం మంచిది” అన్నాను కసిగా.

“క్షమించండి అదుగో ఆ ఆటోవాడే నా చేత ఈ నాటకం ఆడిస్తున్నాడు. బుద్ధి గడ్డి తిని వాడి మాటలు విని ఇలా నాటకం ఆడాను. నన్ను వదిలిపెట్టండి ఇంకెప్పుడూ ఇలాంటి వేషాలు వెయ్యను బుద్ధొచ్చింది” అంటూ లెంప లేసుకున్నాడు వృద్ధుడు. అంతా నా వంక వింతగా చూసారు.

“హవ్వ!” అనుకుంటూ అంతా ముక్కుమీద వేలేసుకున్నారు.

“దీని కంతటికి సూత్రధారి ఆ ఆటోవాడే ముందు వాడిని పట్టుకొండి” అన్నాను.

ఇంకెక్కడ ఆటోవాడు ? మాటల్లో ఎప్పుడో తుర్రుమన్నాడు.

ఏది ఏమైతేనేం ఆ దెబ్బతో మళ్ళీ వాళ్ళిద్దరూ కనిపిస్తే ఒట్టు...

.... దూరి వెంకటరావు


Contact : 9322676343
Resi. : 64169134

Advt.



**Shree Ganesh Enterprises**

***Real Estate Consultant***

Dealing in : Sale, Purchase, Rental & Personal Loan

**ఆఫీస్‌లు, ఫ్లాట్స్, బంగళాలు అద్దెకు గానీ, కొనుగోలుకు గానీ, అమ్మకానికి గానీ, ఇటు వాషి నుండి పన్వేల్ వరకు, అటు డోంబివలి వరకు మమ్మల్ని సంప్రదించండి..!**



**Kishan G. Vasala**

Shop : Shop No.21, Chandresh Niketan, Lodha Heaven Nilje, Dombivali (E), Mumbai - 43.

Resi. : Plot 12/0/5, Baiganwadi, Govandi, Mumbai - 43.

# PG INVESTMENT SHOP

*Professional Insurance & Investment Consultant.*

MEMBER CHAIRMAN CLUB



Gangadhar G. Pillamarapu

Mobile : 93222 18929 / 9004039150

OFF. TEL. : 24913408.

## *Can Help you with All your Financial Needs*

- **Life Insurance** : Policy Loans, Any Changes in your policies, Online Payments, Maturity service.
- **General Insurance** : Mediclaim, Motor Insurance, Home Insurance, Travel insurance.
- **Income Tax** : Tax Calculation, Apply New PAN Card, Tax Returns, Tax saving Schemes.
- **Mutual funds** : Form any company * Open Ended *Close Ended *ELSS Schemes (Tax ben. U/s 80c).
- **New Passport** : Related any Information & Service Provided.

**Just Phone Call away ✷ feel free to contact any time**

LIC — Vehicle Insurance — MediClaim — Postal Savings

House Insurance — New Passport — Mutual Funds — Tax Returns

Advt.

OFFICE : BDD Building No. 94, Shop No. 20, Ground Floor, Near Jamburi Maidan, Worli, Mumbai - 400 018. • E-mail : pginvestus@yahoo.com

**Visit our website : www.pginvestus.com**

# "లైఫీజె జోక్! లాఫిట్టాఫ్"

## ఎ. గౌరి లక్ష్మి

వంటింట్లో పనమ్మాయి రాక, దాని అవతారం ఎత్తి ఏడ్చుకుంటూ పని చేసుకుంటున్న నాకు, శ్రీవారు ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ "జీవితాన్ని సీరియస్‌గా తీసుకోకూడదురా! లైఫీజే జోక్ లాఫిట్టాఫ్" అంటున్న మాటలు విని చిర్రెత్తుకొచ్చింది.

"ఇలారండొకసారి ఫోనయ్యాక" అనరిచాను. అయిదు నిమిషాలాగి వచ్చాడు శ్రీకాంత్. "ఏమిటమ్మాయ్ అరుపులు" అని నవ్వుతూ. "పనిమనిషి రాలేదు. గిన్నెలు మీరు తోమితే నేను లైఫ్‌ని జోగ్గా తీసుకుంటాను" అన్నాను క్రూరంగా.

"ఓ. యస్. దానికేం" అంటూ లుంగీ మడుచుకుని, చొక్కా చేతులు పైకి లాక్కుని బూడిద బుట్టందుకుని స్క్రబ్బర్ తీసి ఒక స్పూన్ తోమాడు. అది సింక్‌లో జారిపోయి కనబడలేదు. దీనంగా నావైపు చూశాడు శ్రీకాంత్.

"ఆగండి. నేను తోముతాను మీరు కడగండి" అన్నాను. శ్రీకాంత్ గిన్నెలు కడుగుతూ వంటిల్లంతా, నా బట్టలంతా తడిపేశాడు. నేను చిరాకునణుచుకుని పని ముగించాను.

భోంచేస్తూంటే మా అబ్బాయడిగాడు. "ఏటిమమ్మీ! గిన్నెలన్నీ ఇలా షైనింగ్ షైనింగ్‌గా ఉన్నాయేంటీ" అని. కొత్త పనిమనిషి, బి.యస్సీ.బి.యడ్ అని ఆయన చెబుతూంటే నాకు నవ్వొచ్చింది.

మర్నాడు ఆదివారం. పసిపిల్లలకు ఐస్‌ఫ్రూట్ మీద ఎంత ఆశుంటుందో అంత ఆశ ఉంటుంది. నాకు శలవు మీద. ఆ రోజు చూస్తు ఉండగానే ఐస్ కరిగినట్టు ఇట్టే కరిగి పోతుంది. శలవునాడు ఘోరంగా రెస్ట్ తీసుకోవాలనీ, బాడీని షడ్డవున్ చెయ్యాలనీ ఒకపక్కా అన్ని పనులూ ఆ రోజు చకచకా చేసెయ్యాలని మరోపక్క కోరిక.

శనివారం రాత్రే శ్రీకాంత్ అడిగాడు 'మాబాస్ కూతురి పెళ్ళి మహబూబ్‌నగర్‌లో వస్తావా' అని. నేను రానన్నాను. ఆదివారం పొద్దున్నే ఐదుగంటలకే బాబును తీసుకుని వెళ్ళిపోయాడు శ్రీకాంత్. ఈ ఆదివారం నాది అనుకుంటూ ఆనందంగా మంచానికడ్డంగా పడుకుని ఎనిమిదికి లేచాను. ముఖం కడుక్కుని టీ చేసుకుంటుంటే నిండిన షింక్ విజిలేసింది. పనమ్మాయి తలుపు తట్టి వెళ్ళిపోయుంటుంది యాహూ! అనుకుంటూ.... ఆనందంగా ఆవిరవగా ధైర్యం తెచ్చుకొని సోఫాలో కూర్చుని టీ.వీ. చూస్తు టీ తాగాను పెద్ద కప్పుతో, ఓ గంటకి విసుగొచ్చి లేచాను. టిఫిన్ మానేసి రెండు బిస్కట్లు తిని అద్దం ముందు నిలబడి "గాల్లో తేలినట్టుందే" అని పాడుకుంటూ డాన్స్ లాంటిది చేశాను.

ఆ తర్వాత దర్జాగా ముందు గదిలో రాక్‌లో నుంచి రంగనాయకమ్మ స్వీట్ హోమ్ తీసుకుని మొక్కల్లో పడక్కుర్చీ వేసుకుని చదువుకుంటూ కూర్చున్నా. నవ్వొచ్చి పెద్దగా నవ్వుకుంటుంటే "టమాటాలమ్మా" అంటూ ఓ లంగా ఓణీపిల్ల బుట్ట దింపింది. "నిన్నెవరు పిల్చారు?" కెవ్వుమన్నాను. "ఎప్పుడూ గేటేనుంటాది ఇయ్యాల కనబడినావు సూసిపోదామనొచ్చినా" అందాపిల్ల స్నేహంగా చూస్తూ. నా చిరాకు మొహం చూసి "వత్తా" అంటూ లేచింది.

సడెన్‌గా న్యూస్ పేపర్ గుర్తొచ్చి దాన్ని తెచ్చుకుని పోర్టికోలో ఓ కుర్చీలో కూర్చుని మరో కుర్చీలో కాళ్ళు పెట్టుకుని పేపర్ మొదలు పెట్టాను. ఆమూలాగ్రం చదవాలని నిర్ణయించుకుని. 'శుభ శుక్రవారంలాగా ఇవాళ శుభాదివారంసుమా' అనుకుంటూ సన్నగా హోమ్ చేసుకుంటూ ఓ పదినిమిషాలు పేపర్లో లీనమయ్యాను.

"ఏమ్మా పొద్దున్న లేవలేదు సినిమాకెళ్ళారా" అంటూ మా పనమ్మాయి జొరబడిపోయింది. "వాకిలి ఊడ్వాలి" అంటూ లేపేసి లోపలికి పంపింది అక్కడ సర్దుకుని కూర్చునేలోగా "గదులు తుడవాలి లేవండి" అని ఆ పై "గుడ్డ పెడతాను, ఫాన్లు వేయండి, కుర్చీలు జరపండి" అని నాకు పనులు పురమాయించింది. ఓ గంట నాతో ఫుట్‌బాల్ ఆడుకుని వెళ్ళింది మహాతల్లి.

అది వెళ్ళేదాకా ఓర్చుకుని తలుపేసుకుని పెళ్ళి ఆల్బమ్ తీసుకూర్చున్నాను. మురిపెంగా సెల్ మోగింది. మా ప్రిన్సిపాలమ్మ. ఆ పేపర్లు దిద్దావా? ఈ నోట్స్ తయారు చేశావా? అంటుందని విసుగేసి ఎత్తలేదు. ఇంతలో ల్యాండ్ లైన్ మోగింది. ఊరి నుంచి అక్క ప్రపంచంలోని వివరాలన్నీ కలిపి ముచ్చట్లు పెట్టేసి అరగంట నిలువునా నమిలేసింది.

మరోసారి టీ తాగి టి.వీ. సినిమాకి సిద్ధమయ్యాను. మరీ పాతసినిమా. కీచుగొంతుక పాటలు. ప్రింట్ బాగోలేదు. చక్కగా గుండమ్మకథ, మిస్సమ్మలాంటి సినిమాలు రాకూడదూ! రావు చచ్చినా రావు అని సణుక్కుంటూ టీ.వీ. ఆపేశాను.

బాగా ఆకలేస్తోంది. స్నానం చేసి రెండిడ్లీలు వేసుకునితిన్నాను. మంచి కవితొకటి రాయాలనుకుని ఇల్లంతా వెతికి రెండు తెల్ల కాగితాలు, పెన్ను తెచ్చుకుని డ్రాయింగ్‌రూమ్‌లో సర్దుకుని కూర్చున్నాను.

"ఇస్త్రీ బట్టలిస్తావా సార్ చెప్పిండు" అంటూ ఇస్త్రీ అమ్మాయి వచ్చింది. ఇంట్లో అక్కడా ఇక్కడా కుక్కి ఉన్న ఉతికిన బట్టలు ముగ్గురివీ తెచ్చి ఇచ్చేసరికి పావుగంటయ్యింది. దాన్ని బైటకి తోసి పరుగున వచ్చి కవిత పేరు రాశాను. "నీలాకాశంలో నిండు చందమామ" బావుంది. రాత్రి ఆకాశాన్ని నక్షత్రాల్ని ఊహించుకుంటూ మరో లైన్ రాశాను. బాలేదు కొట్టేశాను.

"సార్ లేరామ్మా!" ఎవడో దానయ్య!

"చెందులేడాంటీ?" ఎవడో పోకిరీ!


చెవిటి దానిలా సమాధానం చెప్పకుండా ఆలోచించుకుంటూ కూర్చున్నాను. ఇంతలో కరెంట్ పోయింది. గబగబా పేపరు పెన్నూ తీసుకుని మొక్కల్లో చెట్లపక్కన గట్టుమీద కూర్చున్నా.

"ఏంటమ్మాయ్! ఇల్లూ ఆఫీసేనా ఇరుగూ పొరుగూ వద్దా" అని నవ్వుతూ పక్కింటి పిన్నిగారు గోడ దగ్గరికి ప్రేమగా పిల్చి మరో గంట నిర్ధాక్షిణఅయంగా తినేసింది. రాత్రి వంటకి వేళయింది. శ్రీవారూ, బాబు వచ్చి పడిపోయారు.

"ఎన్ని నవలలు చదివావు? ఎన్ని కవితలు గిలికావు?" నవ్వుతూ అడిగాడు శ్రీకాంత్. నేనూ ఇకిలిస్తూ "లైఫిజే జోక్ లాఫిట్టాఫ్" అన్నాను కూరలు తరుగుతూ.

●●●


## మంచిమాటల దర్పణం



**భార్య** తప్పు చేసిందంటే....భర్త అమాయకుడు అని అర్థంకాదు.



మగాళ్ళు ఏది గుర్తు పెట్టుకోరు. ఆడాళ్ళు ఏదీ మరచిపోరు.



ఏ స్త్రీతోనయినా పురుషుడు ఆనందంగా ఉండగలడు. అయితే ఆమెను అతను ప్రేమించకుండా ఉండాలి.



భార్య గయ్యాళిదయితే... అంతకు మించిన ఆధ్యాత్మికత లేదు.


సాహితీ దర్పణం

కవిత

### "మనసులో మాట"

అనాలనుంది  
ఓమాట అనాలనుంది  
ఏనాటి నుండో  
మీటుతుంది  
ఎదను వెయిట్ చేసి చేసి  
లేటైందనీ మనసు దోచి దోచి  
గుండె కాంపౌండులో కాచి కాచి  
దాటదెప్పుడు  
పెదవుల గేటు మాత్రం  
దాగివుంది దాంట్లో  
ప్రేమ సూత్రం  
నా మూడ్ తింటున్న  
ఆ మూడు మాటల్ని  
నీ మూడ్ బాగున్న  
సమయ మందు  
అనాలనుంది అనాలనుంది..  
ఆశ్చర్య పోతవో  
ఆదరించుతవో  
కౌగిలించుతవో  
నన్ను కాదంటవో మరి  
కాసేపాగమనీ  
నా షేపు మార్చుతవో  
తెలుగులో అంటే  
అలుగుతావని నీవు  
తంటాలు పడుతూనే  
అంటున్నాను  
ఇంగ్లీషులో నిన్ను  
ఇష్టపడి అంటున్నా...  
అంటున్నా.. అంటున్నా..  
I Love U....

- ఆనంద భారతి (గడిమెట్ల యెల్లప్ప)




...భమిడిపాటి సోమయాజి

ముప్పేవపడిలో వున్న దీనదయాళ్, పడి పడి తన బావమరిది పెళ్ళికి సతీసమేతంగా హైదరాబాద్ వచ్చాడు. మధ్యాహ్నం పెళ్ళి విందు జరుగుతోంది. మగవాళ్ళ పంక్తిలో వడ్డనలు జరుగుతున్నాయ్. బొబ్బట్లు, మడతకాజా వగైరా స్వీట్లు వడ్డిస్తున్నారు. దీనదయాళ్ ఆకులో మడతకాజా వడ్డించారు. ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదుకాని, అతని భార్య అనసూయ రయ్‌మంటూ వచ్చి, గ్రద్ద పకోడీ పొట్లం తన్నుకుపోయినట్లు, ఆ కాజా అతని విస్తరిలోంచి తీసేసి తన నోట్లోకి తోసేసింది. పైగా "ఆ కాజా వేస్తుంటే వద్దని చెప్పలేదా! మీకు పుట్టెడు డయాబిటిస్ కదా!" అని అరిచింది.

"పుట్టెడు డయాబిటిస్" పద ప్రయోగం చాలా బావుంది! 'పుట్టెడు భూమి' అన్నట్లు వుంది అని ఆమెను మెచ్చుకున్నాను.

తర్వాత బొబ్బట్లు వడ్డిస్తున్నారు. ఆ పంక్తిలో వున్న పేరుగల సంఘ సేవకుడొకాయన "బాబూ! నా ఎడమవైపు అయిదో ఆయనకి బొబ్బట్లు వెయ్యకు. ఆయనకి డయాబిటిస్ వుంది" అని అరిచాడు.

"అదేదో యిల్లు గుర్తుచెప్పినట్లు, ఎడమవైపు అయిదో ఆయన అని చెపుతారేంటండి!" అన్నాడు ఆ వడ్డించే ఆయన.

"మరెలా చెప్పమంటావ్"!

"సిల్కు లాల్చీ వేసుకున్నాయన దీనదయాళ్‌ని అడుగుతూండడం.

# హౌ దీన దయాళో !

అసలు 'మీరెలా వున్నారు" అని అడగడం పోయి, "మీ డయాబిటిస్ ఎలా వుంది" అని కొత్త డాక్టర్నీ మీ ప్రాక్టీస్ ఎలా వుందన్నట్లు అడుగుతారేమిటి, ప్రతీవాళ్ళు అని బాధపడ్డాడు దీనదయాళ్.

ఇంతలో ఒకాయన "నాకు ఎడమవైపు అయిదో వాడుగా కూర్చున్నాడీయన. పాపం!ఈయన భార్య ఆమె పేరేమిటో తెలియదుకానీ, మహాసాధ్వి. ఆమె ఈయన ఎడల చూపిస్తున్న శ్రద్ధాభక్తులకి, అసలీయన డయబటిస్ గురించి ఎవ్వరూ విచారించక్కర్లేదు" అన్నాడు.



అది విన్న దీనదయాళ్ "అసలు నా గురించి వీళ్లెందుకు విచారించడం'' అన్నాడు పక్కన కూర్చున్న తోడల్లుడితో.

తెలుగు పండితుడు దీనదయాళ్ తోడల్లుడు "విచారించడం అంటే బాధపడడం కాదు. విషయం గురించి అడగడం, ఇంగ్లీషులో 'ఎంక్వైరీ' అంటారు" అన్నాడు.

ఇంతలో ఓ పెద్దాయన "దీనదయాళ్ బాబూ! నీకు బీపీ కూడా వుందా" అన్నాడు దీనదయాళ్ కి పిచ్చి కోపం వచ్చింది.

'అసలే దయాబిటిస్‌తోనూ, నా పెళ్ళాంతోటీ పడలేక ఛస్తూంటే 'బి.పి.కూడా వుందా! అని అడుగుతున్నాడు. కొంతమందికి ఎంత వయసొచ్చినా బుద్ధి మాత్రం రాదు' అని చికాకుపడుతూ, కొంచెం తమాయించుకుని, "బీపీ లేదండీ" అన్నాడు.

"నా లెక్క ప్రకారం వుండాలే! షుగర్, బీపీ కవలపిల్లల్లాంటివి" అన్నాడు ఆ పెద్దాయన.

వెధవ లెక్కలూ నువ్వూనూ, ఈ పెళ్ళయిపోయి తిరిగి వెళ్లేలోపులో, నిన్నేదొకటి చేసి వెళ్ళకపోతే నేను సతీ అనసూయ మొగుడ్నేకాను' అనుకున్నాడు దీనదయాళ్ స్వగతంగా.

"ఇంతకీ మీ ఆవిడ పేరేమిటో చెప్పనేలేదు" అన్నాడు ఆ పెద్దాయాన.

పేర్లు చెప్పడానికి యిప్పుడు జరుగుతున్నది నా బావమరిది పెళ్ళి. నా పెళ్లి కాదు అన్నాడు వుక్రోషంతో దీనదయాళ్.

"అది తెలుసునయ్యా నా పెళ్ళి కాదు నా పెళ్ళికాదు అనుకోకూడదు. జీవితమంతా ప్రతీవాడికి ఏదో రకంగా పెళ్ళి జరుగుతూనే వుంటుంది. ఇందాకా విందు జరుగుతుండగా నిన్ను స్వీట్స్ తినకుండా చేసి నీకు మందు కూడా వేసి నీ పెళ్ళి చేసిందికదా నీ భార్య. ఆవిడ పేరు ఒక్కసారి ముద్దుగా చెప్పు. ముచ్చటగా వింటాను. ఏదో పెద్ద వాడ్ని అడిగాను అన్నాడాయన.

పెళ్ళికి వస్తారు. సుష్టుగా నానా రకాల స్వీట్లు తింటారు. అవి అరిగే వరకూ ఏదో ఒకటి మాట్లాడుతుంటారు. అనుకుంటూ "మా ఆవిడ పేరు అసూయ" అన్నాడు.

"అదేమిటి బాబూ! నా లెక్క ప్రకారం 'అనసూయ' అయ్యుండాలే"

"అవునండి. నాకు దయబెటిస్ కదా! పూర్తిగా చెప్పలేను. నీర్సంగా వుంది. అందుకని ఒక అక్షరం లోపం చేశాను" అన్నాడు దీనదయాళ్.

"అసలు అవధానాల్లో అక్షర లోపం పెట్టి సమస్యా పూరణాలు యిస్తారు" అన్నాడు ఓ తెలుగు పండితుడు.

ఇటువంటి అక్షర లోపాలు చెయ్యడం వలననే 'పూర్ణాలు' తినడానికి వీల్లేకుండా పోతుంది ఈ దయాబిటిస్ వున్నవాళ్ళకి" అన్నాడు ఆ పెద్దాయన. ఇవన్నీ విని విని విసిగిపోయిన దీనదయాళ్ రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత ఓ రాత్రివేళ, లైట్ వెయ్యడానికి లేచినట్లు లేచి ఆ చీకట్లో పెద్దాయన కాలిమీద గట్టిగా తొక్కాడు.

"అయ్యో చచ్చాన్రోయ్!" అంటూ లేచాడు ఆయన.

'ఏం! మధ్యాహ్నం విందులో స్వీట్లు తిన్నట్లు లేదూ! పైగా అసలే దాన్ని చేసుకున్నందుకు ఏడుస్తూంటే నా భార్య పేరు చెప్పిస్తావా! పైగా డయాబిటీస్ వున్నవాళ్ళు పూర్ణాలు తినడానికి లేదా!' అని కసిగా అనుకుంటూ, "క్షమించండి" అన్నాడు ఆయనతో.

"ఫర్వాలేదు బాబూ! పెళ్ళిళ్ళల్లో అనేకం జరుగుతాయ్" అంటూ మరి ఎప్పుడు సేకరించాడో ఏమోగాని తన పక్కనున్న చేతి సంచిలో వున్న ఓ కాజా, రెండు పూర్ణాలు యిచ్చి "తినెయ్! అందరూ నిద్రపోతున్నార్లే! మీ ఆవిడకి చెప్పన్లే" అన్నాడు మళ్ళీ తొక్కుతాడేమోనన్న భయంతో.

అలారా దారికి. ఈ రోజుల్లో ఓ తొక్కు తొక్కుతేగాని మనుషులు తిన్నగా వుండరు. అను కుంటూ ఆ కాజా పూర్ణాలు తినేసి, పూర్ణం పూర్ణమిదం అనుకుంటూ పడుకున్నాడు. దీనదయాళ్. ఆ మర్నాడు వుదయం పెళ్ళైపోయింది. ఆడపెళ్ళివారు శుక్రవారం పిల్లని ఇప్పగించమన్నారు. ఆ మర్నాడు శనివారంనాడు అప్పగింతలు నిర్ణయించారు. మరీ మంచిదనుకున్నాడు దీనదయాళ్. ఆ పెద్దాయన ప్రయాణమవడం చూసి, దీనదయాళ్ నీరుకారిపోయాడు. "మీలాంటి పెద్దలు అంకురార్పణనుంచి అప్పగింతల వరకూ వుండాలి" అన్నాడు ఆయనతో.

ఎలాగైనా ఈరోజు రాత్రి కూడా ఈయన కాలు మళ్ళీ తొక్కేసి దొంగతనంగా స్వీట్లు తిందామని. మొత్తం మీద ఆయన ధైర్యంచేసి వుండిపోయాడు. కానీ దీనదయాళ్ పడుకున్నచోట కాకుండా ఇంకోచోట పడుకుందామని ప్రయత్నం చేశాడు. తానొకటి తలిస్తే దైవమొకటి తలిచినట్లు దీనదయాళ్ దగ్గరే పడుకోవడానికి ఏర్పాటు జరిగింది.

ముందురోజు రాత్రి తిన్న స్వీట్లకి, ఆయన యెడల ప్రేమతో మెలుగుతున్నాడు దీనదయాళ్. అసలెందుకు ఆయనతో అంత వుత్సాహంగా నవ్వుతూ తన భర్త మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు అనసూయకి. కారణం అడిగింది "మగాళ్ళతో సరదాగా, నవ్వుతూ మాట్లాడినా నీకు అసూయేనే అనసూయా!" అన్నాడు కాని అసలు విషయం బయటపడనీయలేదు దీనదయాళ్. ముందురోజు రాత్రి భరించిన తొక్కుడు విషయం, బయటెక్కడా చెప్పలేదు ఆ పెద్దాయన. రాత్రవుతోందనగా అరిసెలు లడ్డూలు రకానికి మూడేసి, పెద్దయనకి పురమాయించాడు.

హఠాత్తుగా 'తొక్కుడులడ్డూ' జ్ఞాపకం వచ్చింది. రాత్రి అంత కష్టపడి ఆయన కాలు తొక్కి, తొక్కడానికి సంబందించిన 'తొక్కుడు లడ్డూ' తినకపోవడం సమంజసం కాదని, ఓ అరకిలో తొక్కుడు లడ్డూ కొని తెమ్మని పురమాయించాడు, ఆ పెద్దాయనకి.

'ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చిందన్న' సామెత ఎప్పుడో విన్నాడు. ఆ చావు యిప్పుడు అనుభవిస్తున్నాడు పెద్దాయన. పోనీ ఎవరికైనా చెపుదామంటే దీనదయాళ్ వాళ్ళ యింటి అల్లుడాయే. వాళ్ళు హర్షించరు.

నిద్రకు ముందే ఆ స్వీట్ల నైవేద్యాలు దీనదయాళ్‌కు పెట్టి, అతన్ని నిద్రపుచ్చి "హే! దీనదయాళ్" అంటూ దేవుడికి దండం పెట్టుకుని పడుకున్నాడు ఆ పెద్దాయన.


ఆ మర్నాడు అప్పగింతలై అందరూ వెళుతున్నారు. సతీసమేతంగా ఆ పెద్దాయనకి పాదాభివందనం చేశాడు దీనదయాళ్ కృతజ్ఞతతో...

'ఓరి రాక్షసుడా!' అనుకుంటూ "వెళ్ళిన తర్వాత డయాబిటిస్ లెవెల్ పరీక్ష చేయించుకో బాబూ" అని "అనసూయమ్మా! దీర్ఘసుమంగళీభవ" అని సాగనంపాడు ఆ దంపతుల్ని ఆ పెద్దాయన.

●●●






## విడిచి వచ్చిన పేగు

సాహితీ దర్పణం

కవిత

విమానంలో కూర్చున్న తల్లికి
కూటి కోసం
కూలి పనికెళ్ళే రోజులు గుర్తొచ్చాయి
కన్న పేగులు
కంటి తీగలై
తడి రెప్పల మీద పాకుతున్నాయి.
దుఃఖాన్ని
దూలానికి కట్టెయ్యలేము
దూరాన్ని
దోసిళ్లలో తెచ్చుకోలేము
వలస పోయిన
డాలరు దూడల కోసం
ఆవులాంటి అమ్మకు
కన్ను మూసినా
తెరచినా
మనసు మాత్రం
కొట్టం చుట్టూ తిరుగుతూనే ఉంటుంది.
గడ్డిమోపు కాదు కదా !
నెత్తిన పెట్టుకొని రావటానికి
పచ్చబొట్టు కాదు కదా !
మణి కట్టుమీద పొడిపించుకొని తేవడానికి
నా కొడుకు
చిన్నప్పుడు చెట్టుకు కట్టిన ఉయ్యాలలో
చింత చిగురులా ఊగుతూ ఉంటే
ఏ చింతా లేకుండా ఉండేది
నా కూతురు
కొంగు కొమ్మకు వేలాడుతూ ఉంటే
ఎంత భద్రంగా ఉండేది.
కొడుకా జాగ్రత్త
బిడ్డా పదిలం తల్లీ
దేశం కాని దేశంలో
దుర్మార్గుల ద్వేషంలో
తుపాకులతో జాగ్రత్త
తూటాలతో జాగ్రత్త.

....ఎండ్లూరి సుధాకర్

# ఒబామా గురించి మీకు తెలుసా !



- చిన్నప్పుడు ఒబామా స్పైడర్ మ్యాన్ కోనాన్ ది బార్బేరియన్ కామిక్స్‌ను సేకరించేవారు.
- అద్భుతంగా బాస్కెట్ బాల్ ఆడే ఒబామాను ఆయన హైస్కూల్ సహచరులు
- 'ఒబాంబర్' అని ముచ్చటగా పిలుచుకునే వారు. స్వాహిలీ భాషలో 'ఒబామా అంటే 'వర ప్రసాదుడు' అనే అర్థం ఉలిది.
- తన తండ్రి జ్ఞాపకాల ఆధారంగా 'డ్రీమ్స్ ఫ్రమ్ మై ఫాదర్' పేరిట రూపొందించిన ఆడియో పుస్తకానికి 2006లో గ్రామి అవార్డు లభించింది.
- రెండో ప్రపంచ యుద్ధానంతరం ఎడమ చేతి వాటం గల అమెరికా అధ్యక్షుల్లో ఒబామా ఆరో వ్యక్తి.
- హ్యారీ పాటర్ సిరీస్‌లో ప్రతి పుస్తకాన్ని చదివారు.
- ఆయనకు ఇష్టమైన పుస్తకం హెర్మన్ మెల్విల్ రాసిన 'మోబీ డిక్'
- ప్రపంచ ప్రసిద్ధ బాక్సర్ మహమ్మద్ అలీ ఆటోగ్రాఫ్ చేసిన బాక్సింగ్ గ్లోవ్స్ ఇప్పటికీ ఒబామా వద్ద భద్రంగా ఉన్నాయి. టీనేజర్‌గా ఉన్నప్పుడు బాస్కిన్-రాబిన్స్ ఐస్ క్రీమ్ స్టాల్‌లో పనిచేశారు.
- ఆయన ఇష్టపడే చిరుతిండి చాక్లెట్ పీనట్ ప్రొటీన్ బార్స్.
- ఒబామా స్పానిష్ బాష మాట్లాడగలరు.
- ఒబామాకు నచ్చిన సినిమాలు 'కాసబ్లాంకా' , 'వన్ ఫ్లూ ఓవర్ ది కుకూస్ నెస్ట్'
- మొదటిసారి డేటింగ్ రోజున భార్య మిషెల్‌ను స్పైక్ లీ దర్శకత్వం వహించిన 'డూ ది రైట్ థింగ్' సినిమాకు తీసుకువెళ్లారు.
- ఎప్పుడూ కాఫీ తాగని ఒబామా అరుదుగా మద్యం తీసుకుంటారు.
- టీనేజర్‌గా ఉన్నప్పుడు గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలు వాడారు.
- రాజకీయ నాయకుడు కాకపోయి ఉంటే ఆర్కిటెక్ట్ అయి ఉండేవారు.
- సెనేట్ కార్యాలయంలో ఒబామా ఉపయోగించిన డెస్క్‌ను గతంలో మాజీ అధ్యక్షుడు రాబర్ట్ కెన్నడీ ఉపయోగించేవారు.




## మీటర్ మీద..

'కట్నం పాతిక వేలేగా.. మరి కట్నం మీద పది రూపాయలు అదనంగా ఇస్తున్నారేమిటీ..?' అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు పెళ్లికి వచ్చిన పేరయ్య..

' ఓ అదా..! మా అల్లుడు అటో డ్రైవర్ లెండి.. మీటర్ మీద పదిలాగా.. పాతిక వేల పై పదన్న మాట..' అన్నాడు మామగారు.

# పన్నీరులాంటి బూడిద



రామ్

ఆష్ అంటే ఇంగ్లీషులో బూడిద.

కాలిపోయాక మిగిలేది బూడిద.

కాలినంతసేపు చేతులు ఎగరేసి, అకాశాన్ని సైతం మింగే స్పృహ కనబరిచి.. కొద్ది సేపట్ల నేలరాలేది బూడిద.

ఒక్క వెలుగు వెలిగి దుమ్ము కొట్టుకుపోయేది బూడిద. మనమంతా చివరకి అయ్యేది దుమ్ము, బూడిద.

అమెరికాలో ఇవ్వాళ ఒబామాను గొప్పగా చూస్తున్నాము కానీ కొన్ని దశాబ్దాల క్రితం బూడిద రంగు ఉన్న మనిషిని దహనం చేసి బూడిద చేసేవారు. "నల్లజాతి"పై దారుణమైన వివక్ష చూపిన కాలమది.

అలాంటి బూడిదే ఆర్థర్ ఆష్. గొప్ప టెన్నిస్ ఆటగాడు. గ్రాండ్‌స్లామ్ గెలుచుకున్న ఏకైక నల్లజాతి అమెరికన్. బూడిద తిరగబడితే సూర్యుడికి కూడా చీకటి కమ్మకతప్పదని తెల్లవాళ్లకు చెప్పినవాడు. ఇదంతా తన ఆట ద్వారానే చేసి చూపించాడు.

టెన్నిస్ నుంచి రిటైర్ అయ్యాక, ఆర్థర్ ఆష్‌కి గుండె సర్జరీ చేశారు. రక్త మార్పిడిలో అతనికి ఎయిడ్స్ సోకింది. తను చేయని తప్పుకు ఇంత ఘోరమైన శిక్ష ఎందుకు విధించావని దేవుడిని అడుగు అని ఎవరో అంటే, "ఐదుకోట్ల మంది టెన్నిస్ నేర్చుకుంటారు. అందులో ఐదులక్షల మంది జీవనోపాధి కోసం ఆడుతారు. అందులో యాభైవేల మంది కీర్తి కోసం ఆడుతారు. అందులో ఐదు వేల మంది గ్రాండ్‌స్లామ్‌కు చేరుకుంటారు. యాభై మంది వింబుల్డన్ చేరతారు. నలుగురు సెమీఫైనల్స్‌కు చేరుతారు. ఇద్దర్ ఫైనల్స్క ఆడుతారు. నేను ఒక్కడిని ఛాంపియన్ అయ్యాను. ఆ రోజు చేతిలో ట్రోఫీ పట్టుకుని, 'నాకే ఎందుకిచ్చావు? అని దేవుడిని అడగలేదు. ఇప్పుడు కష్టం వచ్చింది కాబట్టి, నాకే ఎందుకు ఇచ్చావు ? అని అడగాలా? అన్నారట.

దేవుడు ఏది ఇచ్చిన మహాసముద్రమే. కష్టం, సుఖం తాత్కాలికం. బూడిదే నిజం. ఆర్థర్ **1992**లో తుదిశ్వాస విడిచారు. కాని ఆయన జీవితం బూడిదలో పేసిన పన్నీరు కాలేదు. ఆర్థర్ ఆష్ బూడిదలో .... జీవితం అనే పన్నీరు ఇప్పటికీ గుప్పుమంటోంది. ఎప్పటికైనా మనమందరం బూడిద అవ్వడం వాస్తవం. కాకపోతే పన్నీరు కాకుండానే బూడిదవ్వడం బాధకరం.

# అలంకరణ

మహారాజా! శాకపాకాలు, భక్ష్యభోజ్యాలు రుచికరంగా వండడం ఒక ఎత్తు. వాటిని అందంగా సువర్ణపాత్రలలో అలంకరించడం మరొక ఎత్తు. విద్వాంసునికి దీనికి సంబంధించిన సమస్త కళలు తెలిసి వుండాలి.

నాలిక మీద పడిన తర్వాతనే వంటకం రుచి తెలుస్తుంది. పదార్థాలు జిహ్వాకే కాదు. కంటికి కూడా ఇంపుగా వుండాలి. ఆఘ్రాణించడానికి బాగుండాలి. వేడిగా వుండాల్సిన వంటకాలను రాగి పాత్రలతో వుంచి చల్లాకుండా వాటికి తగిన సేవ చేయాలి. అలాగే చల్లగా వుండాల్సిన వాటిని పచ్చని తామర ఆకులలో చుట్టి కాపాడాలి.

పరదేశరాజులు, మహా పండితులు, అస్త్రశస్త్రపారంగతులు తమ ముఖ్య అతిథులుగా విడిది చేసినపుడు పాకవేత్త మరిన్ని మర్యాదలు పాటించాలి.

వంటశాల దేవాలయం లాంటిది. పరిశుభ్రత ఇక్కడ దేవుడు. విలుకాడు ఎంత నైపుణ్యంగా నారి సారించి, గురిపెట్టి బాణాన్ని వదులుతాడో అలాగే ఇక్కడి వారంతా లక్ష్యశుద్ధితో పనిచేయాలి.

మన దేశ ప్రత్యేక రుచులను విశిష్ట అతిథులకు వడ్డించాలి. వారు మన దేశాన్ని చాలా కాలం గుర్తుంచుకునేలాగా చెయ్యాలి. పాకశాలలోని భృత్యులతో సహ శిరోజాలను తగ్గించుకొని ఎర్రని తలపాగాలు ధరించాలి.

అగ్నిదే వరుడి శిఖలవలె పాగా కుచ్చులు కదలడం శుభదాయకం. వండేవారికి, వడ్డించే వారికి పెరిగిన గోళ్ళు వుండరాదు. భోజనానికి ముందు, తర్వాత వడ్డించాల్సిన పదార్థాలు, వాటి విశేష గుణాలను తమరికి మరోసారి విన్నవించుకుంటాను – అని ముగించాడు నలుడు.

ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...

సాహితీ దర్పణం

## కొలువు

కవిత

ఎక్కడో ద్రవమై జారిపోతున్నం
కంటున్న కలల ప్రవాహంలో
ఈదులాడుతున్నం

చేజారిపోతున్న శకలాల్ని
ఒడిసి పట్టుకోవాలనుకుంటున్నం
విరిగిపడుతున్నం లేస్తున్నం కూలుతున్నం
మెల్లి మెల్లిగా కదలడానికి ప్రయత్నిస్తున్నం
గతం నుంచి ఇంతే వర్తమానంలోకి
తొంగి చూడడానికి ప్రయత్నిస్తున్నం

కూలిన మట్టి గోడల మధ్య కలల
కలత చూపులతో విరిగిన మూలవాసాన్ని
పరీక్షగా చూస్తు చంటి పాపలా
తల్చుకుని తల్చుకుని చలించుతున్న గుండె

నా ముప్పైయ్యేండ్ల చదువు
గవర్నమెంట్ ఉద్యోగం
ఐదేండ్ల పాలనా రాజకీయ నాయకుడికి
సలాం చేస్తుంది
వంగి వంగి దండాలు పెట్టిస్తుంది.

ఒక శకలం విరిగిన నిశ్శబ్ద విధ్వంసం
మొండెమ్మీద తల తెగిపడి
చిన్ననాటి జ్ఞాపకాలు ఊపిరి
తెగుతున్నంత బాధ వ్రణమై
చీమూ నెత్తురు కలగలిసి సలపరిస్తుంది.

నలుపు తెలుపుగా బతికినోడికి
రంగుల ప్రపంచం నాగరికత నేర్పింది
మొన్న మొన్నటిదాక నా పల్లెతల్లి
గుండెల మీద సేదదీరిని వాడిని
నన్ను నేను కోల్పోతున్న సమయాన
ఎవరో ఆదుకుంటారన్న సందేహాన్ని
విస్మరిస్తున్న.

కలగంటున్న గమ్యం కోసం వెతుక్కుంటున్న వాణ్ని
ఇప్పుడు నాకు నేనుగా మట్టిలో
విచ్చుకుంటున్న ఓ విత్తనాన్ని!

... ఆడెపు లక్ష్మణ్


## మరాఠీ నేర్చుకుందాం...

'' एकात्र मिळून राहावे ''
1) ఎకాత్ర్ మిళూన్ రాహావే
2) ఐకమత్యంతో కలిసి ఉండాలి.

''देव पाऊला मला''
1) దేవ్ పాఊలా మలా.
2) భగవంతుడు నాకు కనబడ్డాడు.

''प्राणी मात्रांन वर प्रेम करा''
1) ప్రాణి మాత్రాంన్ వర్ ప్రేమ్ కరా.
2) ప్రాణులను ప్రేమించాలి.

''देवाची प्रार्थना करा''
1) దేవాచీ ప్రార్థన కరా.
2) భగవంతుని ప్రార్థించాలి.




## రక్షక భటుడు

పదేళ్ళ చిట్టిబాబు గోదావరిలో పడి కొట్టుకు పోతుంటే పోలీసు వెంకటస్వామి రక్షించి ఇంటికి చేర్చాడు. తల్లి చంటిగాడిని దగ్గరకు తీసుకొని, "నా బాబూ.... నా బాబు.... దేవుళ్ళా కాపాడావు" అంటూనే తడిసిపోయిన పిల్లవాడి జేబులు తడిమి చూసింది.

"నాదేముందమ్మా అంతా దేవుడి దయ. నేను నిమిత్త మాత్రుణ్ణి" అన్నాడు పోలీసు ఆమె పొగడ్తకి కొంచెం సిగ్గుపడుతూ.

"పకోడీలు తెమ్మని రూపాయి బిళ్ల వీడి జేబులో పెట్టాను. అదేం చేశావయ్యా" అంది తల్లి పోలీసు వైపు అనుమానంగా చూస్తూ...



# CENTERE

CENTERE

# చిన్న కథ

- ఎమ్వీఆర్

**చా**లా ప్రభుత్వ కార్యాలయాల్లో జీతాలు ఇచ్చే రోజు ఆఫీసు బయట చీరలు, కంబళ్ళు, స్వీట్స్, పెర్ఫ్యూమ్స్ ఇతర ఫెన్సీ వస్తువులు అమ్మే అనేక మంది చిల్లర వ్యాపారస్తులు పోగవుతారు. వీరే కాక చందాల కోసం వచ్చే బీదవారు కూడా తక్కువేం కాదు.

## బుల్లి బిర్లా

ఆ రోజు జీతాల రోజు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే శ్రీకర్ సీట్ దగ్గరికి ఓ పదహారేళ్ల కుర్రాడు వచ్చి అతనికి నమస్కారం చేసాడు. శ్రీకర్ అతన్ని చూసి చెప్పాడు.

“ఓ అరగంట ఆగు. ఇంకా జీతం తీసుకోలేదు”

అరగంట తర్వాత జీతం ముట్టాక శ్రీకర్ అతనికి నూట డెబ్భై అయిదు రూపాయలు ఇచ్చి పంపాడు. అది గమనించిన శ్రీకర్ కోలిగ్ అడిగాడు.

“ఇన్‌స్టాల్‌మెంట్‌లో ఏదైనా కొన్నావా?”

“అవును. సైకిల్ కొన్నాను.”

అదేమిటి ? నువ్వు స్కూటర్ మీద కదా వచ్చేది ? మరి సైకిల్‌ని ఎందుకు కొన్నావు?

“నాకే కొన్నారండి నేను స్కూలుకు వెళ్ళడానికి సార్ ఇన్‌స్టాల్‌మెంట్‌లో కొనిచ్చారు.” ఆ కుర్రాడు చెప్పాడు.

అతనెళ్ళాక శ్రీకర్‌తో చెప్పాడు కోలిగ్.

చూడు బ్రదర్. మనం బిల్‌గేట్స్ కాదు, బిర్లాలం అంతకంటే కాదు. మనకి రేపు అవసరం అయితే ఇచ్చే వాడుండడు. మన స్థాయి సంపాదనగలవారు దానాలు చేయకపోవడం మంచిది.



“శ్రీకర్ బదులుగా నవ్వాడు కాని సమాధానం చెప్పలేదు.

ఏమిటలా నవ్వావ్ ?

ఆర్గ్యుమెంట్ ఎందుకని

చెప్పు చెప్పు వింటాను కాని ఆర్గ్యూ చేయనని ప్రామిస్

హామి ఇచ్చాడు కొలిగ్.

ఇతరులకు సహాయం చేయడానికి కోట్ల డాలర్లతో బీదలకి పెద్ద ఫండ్ ఏర్పాటు చేసిన బిల్‌గేట్సో, కోట్లాది రూపాయలతో కొండల మీద ఆలయాలు కట్టించే బిర్లానో అపాలసిన అవసరం లేదు. వాళ్ళే ఇందుకు అర్హులు అనుకోవడం అవివేకం. నేను వైజాగ్‌లో చదువుకునే రోజుల్లో కె.జి.హెచ్.లో యు.డి.సి.గా కౌసల్య అనే ఆమె పని చేసేది. ఆవిడ గురించి తర్వాత ఓ దిన పత్రిక ఆదివారం అనుబంధంలో చదివితే కాని ఇప్పుడు నేను చెప్పబోయేది తెలీదు. ఆవిడ తన జీవిత కాలంలో సంపాదించిన జీతంలోంచి పదిశాతం బీదవాళ్ల అవసరాలకే ఖర్చు చేసింది. స్కూలుకు వెళ్లడానికి యునిఫాం లేని బీద విద్యార్థికి, ఇంటర్వ్యూకి చెప్పులు లేని నిరుద్యోగికి, ఓ పాత సైకిల్‌కి ఓ కొత్తటైరు, నిత్యం వాడాల్సిన డయాబెటిస్ మందు ఆ జబ్బుతో బాధపడే బీదవారికి ఇలా ఆవిడ తన జీవిత కాలంలో కొన్ని వందల మందికి నాలుగు లక్షలపైగానే ఖర్చు చేసి, వారి జీవితాల్లోని చీకట్లని తొలగించి చిన్నపాటి వెలుగుని ఇవ్వగలిగింది. బిల్‌గేట్స్, బిర్లాలకి వాళ్లని వదిలేయలేదు. వదిలేసిన వాళ్లిద్దరు నించి వారికి ఎలాంటి సహాయం అందేది కాదు. మనలాంటి వారు దేశంలో ఎక్కువ. మనలోని ప్రతీవారు తమ స్థాయిలో ఎంతో కొంత బీదలకు సహాయం చేయాలన్న నీతిని నేను ఆవిడనుంచి అనుభవ పూర్వకంగా నేర్చుకున్నాను.

"అనుభవ పూర్వకంగానా? నీకు ఆవిడతో పరిచయం ఉందా?" ప్రశ్నించాడు కొలిగ్.

"కౌసల్యే కాలేజి ఫీజ్ కట్టింది. హార్బర్‌లో పని చేసే మరో మంచి వ్యక్తి నరసింహారావు నాకు పుస్తకాలు, మంత్లీ మీల్స్ టికెట్స్ కూడా కొనిపెట్టేవాడు. వారి సాయం లేకపోతే నేను ఏ పెట్రోల్ బంక్‌లో కార్మికుడిగానే, బట్టల కొట్టులో సేల్స్‌మెన్‌గానో పనిచేస్తుండేవాడిని."

అతని కోలిగ్ ఆశ్చర్యంగా చూసాడు.

"నెల నెలా నేను జీతం రోజు వాళ్ళ దగ్గరికి వెళ్ళి ఆ డబ్బు తీసుకునేవాడ్ని లేదా ఖర్చయిపోతుందనేవారు. ఇదే పాలసీని నేను అనుసరిస్తున్నాను."

అతని కోలిగ్ కొద్ది సేపు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత చెప్పాడు.

"నువ్వు చెప్పిన పాయింట్ ఉంది. నా మనసుని శోధించి చూస్తే, నేను ఇందాక అన్న మాటలు నాలోని స్వార్థాన్ని చంపుకోలేక నన్ను నేను సమర్థించుకునేందుకు మాట్లాడినవే అన్న సత్యం నాకు బోధ పడింది. ఇచ్చే మనసున్న వాళ్ళంతా బుల్లి బిర్లాలే.

"ఆ కుర్రాడి తమ్ముడికి థైరాయిడ్ సమస్య. రోజూ అయిదారు రూపాయల మాత్రలు జీవితాంతం వాడాలి. నువ్వు సరేనంటే అతన్ని పిలుస్తాను". చెప్పాడు శ్రీకర్.

"సరే నా మనసు వీళ్ల స్వార్థంతో చిక్కుకోక ముందే పిలు."

శ్రీకర్ తన ఆఫీసు కిటికీ దగ్గరకి వెళ్లి కిందికి చూస్తు గట్టిగా పిలిచాడు.

"శీనూ! ఓసారి మళ్ళీపైకిరా"..

●●●

## 'పద్మ' అవార్డు గ్రహీతలైన తెలుగు కాంతి పుంజాలకు ఆంధ్ర మహాసభ తరపున హార్థిక అభినందనలు ...

వివిధ రంగాలలో అపూర్వమైన సేవలందించి, ఆయా రంగాలలో అనితర సాధ్యమైన ప్రతిభను చూయించిన తెలుగు వెలుగులను విరజిమ్మి జాతీయ స్థాయిలో 'పద్మ' అవార్డులు పొందిన వారందరికీ ముంబై పరిసర ప్రాంత తెలుగువారందరి తరపున హృదయపూర్వక గౌరవాభినందనలు అందిస్తున్నాం. మున్ముందు కూడా తెలుగు వ్యక్తులు మరిన్ని అవార్డులను సంపాదించి మనందరికి గర్వకారణం కాగలరని ఆకాంక్షిస్తున్నాం.

| | | |
|---|---|---|
| 1 | సూపర్ స్టార్ కృష్ణ | పద్మభూషణ్ |
| 2 | బ్రహ్మానందం | పద్మశ్రీ |
| 3 | గొరిపర్తి నరసింహరాజు | పద్మశ్రీ |
| 4 | డా॥ శంకర్ రెడ్డి | పద్మశ్రీ |
| 5 | డా॥ పప్పు శ్యామల | పద్మశ్రీ |
| 6 | బేగం బిల్కిస్ లతీఫ్ | పద్మశ్రీ |
| 7 | సాయి బాబా గౌడ్ | పద్మశ్రీ |



# దర్పణం లో జరిగన కార్యక్రమాలు

**తేది 10/01/2009 ఆదివారం, సా॥ 6 గం॥లకు. కవిసమ్మేళనం**

**ము**ంబై తెలుగువారు తెలుగు భాషాభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమని, ఆంధ్ర ప్రదేశ్ కంటే ఇక్కడే తెలుగు వాతావరణం వెల్లివిరుస్తోందని, తెలుగు సాహిత్యం ముంబైలో పరవళ్లు తొక్కడం ప్రత్యేక్షంగా గమనించానని ప్రముఖ జానపద గేయ రచయిత. కవి చెన్నాడి వెంకట రమణారావు అభినందించారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆంధ్ర మహాసభ నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆంధ్ర మహాసభలో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించిన ఈ కవి సమ్మేళనంలో ముంబై, భీవండీ, పన్వేల్, అంబర్‌నాథ్, వాషికి చెందిన ప్రముఖ ముంబై తెలుగు కవులు, రచయితలు పాల్గొన్నారు.



తొలుత మహాసభ ప్రధాన కార్యదర్శి భోగా సహాదేవ్ సభకు స్వాగతం పలికారు. ముఖ్య అతిథి రమణారావు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలానంతరం, ఉపాధ్యక్షులు డా. విజయసారథి పరిచయ వాక్యాలు పలికారు.

రమణారావు తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ జానపద కవి అని, ఇప్పటివరకు ఆయన మూడు పుస్తకాలు రచించారని, రెండు జానపద గీతాల సీడీలు వెలువడ్డాయన చెప్పారు. కవి సమ్మేళనంలో మొదట ద్యావరిశెట్టి వెంకటేశ్వర్లు ముంబై ప్రశస్తిని గురించి సీస పద్యంలో వివరించారు. ఎ. మల్లికార్జున రెడ్డి తనదైన శైలిలో తెలుగు గొప్పదనం గురించి ఓ కవిత వినిపించారు. నిర్మానుష్యమవుతున్న పల్లెగుండె కోతల్ని, కావలి రాములు పల్లె స్మృతుల్ని నెమరునేసుకునేందుకు సమయాన్ని ఆగిపొమ్మనే కవితను యుకే మేఘ, నడిమెట్ల యెల్లప్ప పరాయిదైపోయిన తన ఊరు బావుపేట గురించి ఆర్ధ్రంగా తన కవితను వినిపించి సభాసదులకు సొంత గ్రామ జ్ఞాపకాలను గుర్తు చేశారు.

జక్కని రాజారాం సంక్రాంతి వేడుకలను, సహజకవి భీవండికి చెందిన డా. పాము మనోహర్ ముగ్గులేసే పల్లె పడుచు అంతరంగాన్ని ఆవిష్కరించారు. నేటి సమాజంపై టీవీ ప్రభావాన్ని సంగెవేని రవీంద్ర తన కవితలో 'ఛా' అనే శీర్షికతో నిరసించారు. ఏ.వీ. అనంతరాం అవహేళనకు గురవుతూ, దేశరక్షణలో తలమునకలవుతున్న సర్దార్జీల మనోవేదనను చక్కగా తన కవితలో వివరించారు.



గందూరి లక్ష్మీనారాయణ, వడిగొప్పుల శంకర్, చందోబద్ధమైన పద్యాలు వినిపించి సభను రంజింప చేశారు. మచ్చ ప్రభాకర్ రాజకీయ కాలుష్యాన్ని తన కవితలో ప్రతిబింబింప చేశారు. డా. కేవీ నరసింహారావు, జి. విజయలక్ష్మి, యెల్ది సుదర్శన్, గట్టు నర్సయ్య, గుర్రపు కిషన్, గుర్రం బాలరాజు, తదితరుల కవులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రముఖ భాషావేత్త సాంపుతి సురేంద్రనాథ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రమణా రావు తన అధ్యక్షోపన్యాసంలో గోమాత, నేతన్న, మాయమవుతున్న కులవృత్తులపై వినిపించిన పాటలు సభికుల్ని రంజింపజేశాయి. ఇలాంటి సాహితీ కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని సభాధ్యక్షుడు మర్రి జానార్ధన్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి గట్టు నర్సయ్య వందన సమర్పణ గావించారు.

**తేది 17/01/2009 శనివారం, మ॥ 12.30 గం॥ల నుండి 4.30 గం॥ వరకు. సంక్రాంతి సంబరాలు..**



తెలుగు సంస్కృతి పరిరక్షణతో పాటు నేటి మహిళ అనేక రంగాల్లో ముందంజ వేస్తోందని ఆంధ్ర మహాసభ మహిళశాఖ అధ్యక్షురాలు టి. కమలాకుమారి అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆంధ్ర మహాసభలో మహిళా శాఖ ఆధ్వర్యంలో శనివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

స్థానిక మహిళలతో పాటు వాషి, నవీ ముంబై, నెరుల్ నుంచి కూడా విచ్చేసిన మహిళలు ఇందులో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత మహిళా శాఖ అధ్యక్షురాలు టి. కమలకుమారి, కార్యదర్శి వాణీరావు మహిళలకు స్వాగతం పలికారు. సాంస్కతిక కార్యక్రమాల్లో భాగంగా విలాసినీ రావు వయోలిన్‌పై ఆలపించిన మధుర గీతాలు శ్రోతలను కట్టివేశాయి. ఇంట్లో వస్తువులు



తయారుచేసుకునే పద్ధతులను లీలారావు విజ్ఞానదాయకంగా వివరించారు. గ్రీటింగ్ కార్డులు లాంటివి కొనుగోలు చేయకుండా ఇంట్లోనే ఎలా తయారుచేసుకోవచ్చో ఆమె సోదాహరణంగా వివరించారు. ముగ్గుల పోటీల్లో అన్ని వయసుల మహిళలు ఆసక్తిగా పాల్గొన్నారు.

రకరకాల ముగ్గులతో మహాసభ ప్రాంగణం తెలుగుదనాన్ని ప్రతిబింబించింది. జయశ్యామల, విజయలక్ష్మి, వరలక్ష్మి న్యాయమూర్తులుగా వ్యవహరించిన ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మహిళా శాఖ వారు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాల్ని కూడా ప్రదానం చేశారు.

**తేది 18/01/2009 ఆదివారం, సా॥ 7.00 గం॥లకు. కూచిపూడి నృత్య ప్రదర్శన**



అసహజమైన సినిమా ప్రవాహానికి ఎదురీదుతూ కూచిపూడి శాస్త్రీయ నృత్యానికి ఒక కుటుంబం మొత్తం అంకితమై సేవ చేయడం అపూర్వమని, ఇలాంటి వారివల్లే ఇంకా తెలుగు సంస్కృతి పరిరక్షింపబడుతోందని, ఇలాంటి వారిని ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందని బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఎమ్మెస్ రెడ్డి అన్నారు. ఆంధ్ర మహాసభలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అమూక్త మాల్యద కూచిపూడి నృత్య ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తొలుత ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శి భోగ సహదేవ్ సభకు స్వాగతం పలికారు. సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులు కె. భాస్కర్ రెడ్డి కళాకారులను పరిచయం చేశారు.



స్వరాభిషేకం లాంటి అనేక సినిమాల్లో నటించిన అముక్త మాల్యద పిన్న వయసులోనే కూచిపూడి శాస్త్రీయ నృత్యరంగంలో ఎన్నో ఉన్నత శిఖరాలు ఆధిరోహించారని అన్నారు.

ఆమె తన గురువైన బాల కొండలరావు కుమారుడితోనే అముక్త మాల్యద పెళ్లి జరిగిందని, ఆమె శ్రీవారైన ఆనంద శ్రీవారి పేరున్న మృదంగ విద్వాంసుడని, బాలగారి రెండో కొడుకు ఆదిత్య బ్రహ్మం నృత్య ప్రదర్శనలకు గాత్రదానం చేస్తుంటాడని, ఈ రకంగా ఆ కుటుంబం అంతా కూచిపూడికే అంకితమయ్యారని అన్నారు. మహాగణపతి మనసా స్మరామీతో ఆరంభమైన ఆముక్త మాల్యద కూడిపూడి నృత్యప్రదర్శన సభాసదుల్ని విశేషంగా ఆకట్టుకుంది.

ఆమెతో పాటు హేమంత్‌కళ్యాణ్ రాగంలో ఆలాపించిన లింగాష్టకంపై బేబీ అంజనా ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది.

ఆడెనమ్మా శివుడు అనే కీర్తనపై ఆముక్త మాల్యద చేసిన శివతాండవం చూపరులను ఉర్రూతలూగించింది. రాగమాలిక రాగంలో నందకుమార అనే కీర్తనపై చేసిన నృత్యం, కనపరిచిన హావభావాలు, నవరసాల్ని పండించిన తీరుకు ప్రేక్షకులు నీరాజనాలు పలికారు.

వివిధ రకాల భావోద్వేరాలను అబ్బురపరిచే రీతిలో తన ముఖారవిందంలో ఆమె పలికించిన తీరు. మెరుపు తీగెలా నర్తించిన వైనం, నృత్యంలోని సహజత, వేగం ప్రేక్షకుల్ని మైమరపింపచేశాయి. తాళ, మృదంగ, వీణానాదాలకు అనుగుణంగా, బ్రహ్మమొక్కటే అనే రామదాసు కీర్తనపై జంతువుల హావబావాలు, రాజు, బంటు నిద్రల సారూప్యతను చక్కగా అభినయించి అభినందనలు అందుకుంది. మానస సంచరరేపై బేబీ అంజనా చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వేదిక కార్యక్రమంలో మహాసభ అధ్యక్షుడు మూల సిద్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి సహదేవ్, ముఖ్య అతిథి ఎమ్మెస్ రెడ్డి, బాలా కొండలరావు, ధర్మకర్తల మండలి కార్యదర్శి వినాయక రామరావు పీఠంపై ఆసీనులయ్యారు. సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. ముంబైలాంటి నగరంలో కూడా శాస్త్రీయ నృత్యానికి ఆదరణ తగ్గలేదనే విషయం రుజువైందని, హృదయాన్ని కదిలించే నృత్యాలకు ప్రజలు ఎల్లప్పుడూ జోహార్లు పలుకుతారని అన్నారు. ఆముక్త మాల్యదతో పాటు కళాకారులను, ముఖ్య అతిథిని మహాసభ తరపున ఘనంగా సన్మానించారు. ప్రేక్షకులకు ఎంతో ఉద్వేగాన్ని కలిగించిన ఈ నృత్యప్రదర్శన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మర్రి జనార్ధన్‌తో పాటు, ధర్మకర్తల మండలి సభ్యుడు ఎల్వీ రావు, అనుమల్ల రమేశ్, ఓ సుబ్రహ్మణ్యం, యెల్లప్ప, సోమల్ రాజేశ్వరరావు, గుజ్జుల శంకర్ తదితరులు పాల్గొన్నారు. సంయుక్త కార్యదర్శి గట్టు నర్సయ్య వందన సమర్పణ గావించారు.

## తేది 17/01/2009 శనివారం, సా॥ 7.00 గం॥లకు. చక్రపాణికి సన్మానం

**భా**ష ఆధారంగానే ఒక్క రాష్ట్రంగా ఏర్పడ్డాం, ఎవరు, ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రాన్ని విడదీయలేరనీ ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి చైర్మన్ డా. చక్రపాణి అన్నారు. ముంబై నగరంలో తెలుగు భాషా వికాసం కోసం జరుగుతున్న ప్రయత్నాలు అభినందనీయమని ఆయన అన్నారు.

మండలి రూల్స్ కమిటీ చైర్మన్ హోదాలో మహారాష్ట్ర శాసన మండలి అమలు చేస్తున్న నియమాలను అధ్యయనం చేసేందుకు ఎమ్మెల్సీలు పువ్వాడ నాగేశ్వర్ రావు, చెరుపల్లి సీతారాములతో కలిసి మహారాష్ట్ర పర్యటనకు వచ్చిన చక్రపాణి బృందానికి ఆంధ్ర మహాసభ ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం ప్రభుత్వం బ్రిటీష్ వారికి మొదటిసారిగా దత్తత ఇచ్చిన జిల్లాలే సర్కారు జిల్లాలుగా, అనంతరం దారాదత్తం చేసిన జిల్లాలు సీడెడ్‌గా పిలువబడ్డాయన్నారు.



పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిందని, తెలుగు భాషే ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలను కలిపి ఉంచుతోందని పేర్కొంటూ సమైక్య వాదాన్ని నొక్కిచెప్పారు.

ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న తెలుగువారి కోసం ఏర్పాటు చేసిన సభాసంఘం అధ్యక్షుని హోదాలో త్వరంలోనే మరోసారి ముంబై వస్తామని, ఇక్కడ తెలుగువారి భాషా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని, ముంబై యూనివర్సిటీలో తెలుగు పీఠం ఏర్పాటుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

తొలత ప్రధాన కార్యదర్శి భోగ సహదేవ్ సభకు స్వాగతం పలికారు. చక్రపాణితో సహా పువ్వాడ నాగేశ్వర్‌రావు, సీతారాములు, అధ్యక్షులు మూల సిద్ధారెడ్డి వేదికను అలంకరించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి తన కవితలతో చక్రపాణిని పొగడ్తలతో ముంచెత్తారు. ముంబైలో తెలుగు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువుపెడుతూ గంగాధర్‌రెడ్డి, యెల్ది సుదర్శన్, సంగెవేని రవీంద్ర తదితరులు ప్రసంగించారు.



ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో మంత్రులే తెలుగు మాట్లాడడం లేదని సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషా పరిరక్షణ కోసం జరిగిన పోరాటంలో నిజాం ప్రభుత్వాన్ని పారదోలగలిగాం, కానీ మళ్లీ ఇప్పుడు తెలుగు భాష పరిరక్షణ కోసం పోరాటం చేయాల్సిన అగత్యం ఏర్పడిందని పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. అధ్యక్షుడు సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్ర మహాసభ తెలుగువారి భాషా సంస్కృతుల కోసం తన వంతు సేవలు అందిస్తోందన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు మర్రి జానర్దన్, భాస్కర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు యెల్లప్ప, జీ.నర్సయ్య, సీవీరెడ్డి, రంగరాజు, గంజి గోవర్ధన్, వాసాల కిషన్, మారుతి కుంచాల్, ఆర్కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తేది 24, 25/01/2009 సా॥ 6.00 గం॥లకు. క్రీడలు**



భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మహాసభ ప్రాంగణంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడాపోటీల్లో తెలుగు విద్యార్థులు విజయ ఢంకా మోగించారు.

అండర్ 16 శ్రేణిలో నిర్వహించిన ఈ పోటీల్లో ముంబైలోని ప్రముఖ పాఠశాలలకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. బాలికల శ్రేణిలో ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన జట్టు సీజే హైస్కూల్ జట్టును ఓడించి మొదటి స్థానం సంపాదించుకున్నారు.

సీజే హైస్కూల్ ఉపవిజేత గా నిలిచింది. బాలుర శ్రేణిలో మళ్లీ ఆంధ్ర జట్టే మాటుంగాలోని అమూలఖ్ అమీచంద్ స్కూల్ జట్టును ఓడించి విజేత గా నిలిచింది.

రెండు విభాగాల్లో ఆంధ్రస్కూల్ జట్లే గెలుపొందడం పట్ల స్కూల్ యాజమాన్యంతో పాటు మహాసభ అధ్యక్షుడు మూల సిద్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి బోగా సహదేవ్ తో పాటు కార్యవర్గం మొత్తం హర్షం వ్యక్తం చేశారు.

మహాసభ జీవిత సభ్యుల కోసం నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో సింగిల్స్ విభాగంలో ఏఎస్ఆర్ కృష్ణప్రసాద్ మొదటి స్థానంలో, ఎన్. వేణుగోపాల్ రావు రెండవ స్థానంలో నిలిచారు. డబుల్స్ విభాగంలో ఎన్ వేణుగోపాల్‌రావు, అనుమల్ల రమేశ్‌లను ఓడించి కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌లు విజేతగా నిలిచారు. అండర్ 16 బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికల విభాగంలో ఏ.మేఘనా, బాలుర విభాగంలో ఏ.రవితేజరెడ్డి, విజేతలుగా గెలుపొందారు. వీరందరిని జనవరి 26 నాడు గణతంత్ర దినోత్సవ వేడుకల నాడు సభాముఖంగా ఘనంగా సన్మానించారు. ఈ క్రీడోత్సవాలను ఎన్. వేణుగోపాల్‌రావు నిర్వహించారు. ఇందులో కే. భాస్కర్‌రెడ్డి, డా.విజయసారథి, నడిమెట్ల యెల్లప్ప, గట్టు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

**తేది 25/01/2009 ఆదివారం, సా॥ 6.00 గం॥లకు. ఇంద్రజాల ప్రదర్శన**





ఆంధ్ర మహాసభలో గణతంత్రదినోత్సవ వేడుకల సందర్భంగా రెండు రోజులు ఇంద్రజాల ప్రదర్శనలతో పాటు వివిధ సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి 25 నాడు సాయంత్రం మహాసభ సభాగృహంలో రత్నాకర్ గౌడ్ బృందం ప్రదర్శించిన మ్యాజిక్ షో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది.

భారీ సంఖ్యలో విచ్చేసిన జనం ఆయన ప్రదర్శించిన ఇంద్రజాల అంశాలకు విస్తుపోయారు. కాగితాల్ని మన ఏదురుగానే కాల్చి ఆ బూడిద నుండి గులాబీలను సృష్టించడం, శూన్యంలో ఎలాంటి ఆధారం లేకుండా పిల్లాడ్ని గాలిలో తేలించడం, ఉగ్రవాదులు బంధించిన దేశభక్తున్ని, చిటికలో విడుదల చేసి అతడి స్థానంలో ఉగ్రవాదిని బంధించడం ప్రేక్షకుల్ని అబ్బురపరిచాయి.

బాక్స్ వెనుక నిలిపిన అబ్బాయి కాళ్లు చేతులు అసహజంగా కిందికి మీదికి రబ్బరు వస్తువులా సాగడం, చేతిలోని కర్చీఫ్‌ను మాయం చేయడం లాంటి గిమ్మిక్కులు సభాసదుల్ని అలరించాయి. మర్రిపెల్లి శ్రీనివాస్ నాలుగు బ్లేడులు మింగి బోలెడు బ్లేడులను నోట్లోనుండి వరుసగా తీయడం, కత్తిని మింగి దానికి బదులుగా వంద మీటర్ల డెకోరేటివ్ టేపును సృష్టించడం, అందరూ చూస్తుండగానే నోట్లో నుండి ప్లాస్టిక్ బాల్స్‌ను తీయడం, వివిధ దేశాలకు చెందిన జాతీయ పతాకాలను నోట్లో నుండి వరుస బెట్టి బయటకు లాగడం లాంటి అంశాలకు ప్రేక్షకులు చప్పట్లతో స్పందించారు. వసంత్‌కుమార్ పిల్లలతో చేసిన మ్యాజిక్కు, అందరి ముందే చంటాడి అండర్‌వేర్‌ను బయటకు లాగడం, మాట్లాడే బొమ్మతో ఆయన చేసిన విన్యాసాలు అందర్ని కడుపుబ్బ నవ్వించాయి. రాజు చేసిన మిమిక్రీ వెరయిటీగా ఉండి అలరించింది.

చివరగా రత్నాకర్ గౌడ్ మనిషిని టేబుల్‌పై పడుకోబెట్టి అందరు చూస్తుండగానే రంపంతో రెండు ముక్కలుగా కోయడం ప్రేక్షకుల్లో ఉత్కంఠను కలిగించడంలో పాటు గగుర్పాటుకు గురిచేసింది.

కార్యక్రమం తర్వాత మహాసభ కార్యవర్గం మెజీషియన్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర బ్యాంక్ చీఫ్ మేనేజర్ సురేంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసారు.



ఈ కార్యక్రమంలో ముంబై నలుమూల్నుండి తెలుగు వారు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మహాసభ పదాధికారులు మర్రి జనార్దన్, కె.బాస్కర్ రెడ్డి, డా. విజయ్‌సారథి, నడిమెట్ల యెల్లప్ప, దాస చంద్రకాంత్, గట్టు నర్సయ్యలతో పాటు కార్యనిర్వహక సభ్యులు బింగి సత్యనారాయణ, బదుగు విశ్వనాథ్, గుజ్జుల శంకర్, సోమల్ రాజేశ్వర్ రావు, అనుమల్ల రమేశ్, పి. గంగాధర్, యెలిగేటి రాజ్‌కుమార్, ఒ. సుబ్రహ్మణ్యం, దాస చంద్రకాంత్, డా.వీరబత్తిని చంద్రశేఖర్, బి.ఎస్. రావు, తదితరులు పాల్గొన్నారు.

## తేది 26/01/2009 సోమవారం ఉ॥ 10.00 గం॥లకు. గణతంత్ర దినోత్సవ వేడుకలు



వందలాది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సభ్యులు సమక్షంలో ముఖ్య అతిథి, అదాయపు పన్ను శాఖలో కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వి. దివాకర్ ప్రసాద్ గారి చేతుల మీదుగా పతాకావిష్కరణ జరిగిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. భానుమతి ప్రార్థన గీతం ఆలాపించారు.

గిరిజ, భానుమతి, సహదేవ్, నర్సయ్య, రాజేశ్వర్ రావు పాడిన దేశభక్తి గీతాలు సభికుల్ని ఆలరించాయి. బాలబాలికలు ప్రదర్శించిన నృత్యాలు, రూపకాలు ఆకట్టుకున్నాయి. 'ప్రే ఫర్ ఇండియా' అనే పాటపై పిల్లలు చేసిన నృత్యం సభికుల్ని మైమరిపించింది.

మహిళా శాఖ వారు నిర్వహించిన డిబేట్ ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యఅతిథి దివాకర్ ప్రసాద్ మాట్లాడుతూ యునెస్కో నిర్వహించిన ఒక సర్వేలో భారత జాతీయ గీతం 'జనగణమన' మొదటి స్థానంలో నిలిచిందనీ, ఇది మనందరికీ గర్వకారణమనీ అన్నారు. తెలుగును ప్రస్తావిస్తూ తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అనే కంటే ఇటాలియన్ ఈజ్ తెలుగు ఆఫ్ వెస్ట్ అనాలనీ, తెలుగు చాలా గొప్పభాష అని కొనియాడారు.

ఈ సందర్భంగా నిర్వహించిన బ్యాట్‌మింటన్ పోటీల్లో గెలుపొందిన కృష్ణ ప్రసాద్, వేణుగోపాల్ రావు, అనుమల్ల రమేశ్, మేఘన, రవితేజ రెడ్డిలకు కూడా బహుమతులు అందించారు. ముఖ్య అతిథితో పాటు అధ్యక్షుడు మూల సిద్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి భోగ సహదేవ్, మహిళా శాఖ అధ్యక్షురాలు కమలకుమారి, ఉపాధ్యక్షులు డా. విజయసారిథి, కే. భాస్కర్ రెడ్డి, గట్టు నర్సయ్య, యెల్లప్ప వేదికను అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మర్రి జనార్దన్‌తో పాటు కార్యనిర్వాహక సభ్యులైన బింగి సత్యనారాయణ, బదుగు విశ్వనాథ్, గుజ్జుల శంకర్, సోమల్ రాజేశ్వర్ రావు, అనుమల్ల రమేశ్, పి. గంగాధర్, యెలిగేటి రాజ్‌కుమార్, ఒ. సుబ్రహ్మణ్యం, దాస చంద్రకాంత్, డా.వీరబత్తిని చంద్రశేఖర్, బి.ఎస్. రావు, తదితరులు పాల్గొన్నారు.



# గబ్బిలంలో జాషువా వ్యక్తిత్వం



## సృష్టి

**"నా కవితా వధూటి వదనంబు నెగదిగజూచి రూపురే**
**ఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళి యన్నవారే మీ**
**దేకులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవు చో**
**బాకును గ్రుమ్మి నట్లగును పార్థివచంద్ర! వచింపసిగ్గగున్"**

–ఇది జాషువా గుండెలోంచి లావారా పెల్లుబికిన పద్యరత్నం. జాషువా వ్యక్తిత్వమే అతని కవిత్వం. ఆయన జీవితాన్ని కవిత్వాన్ని వేరుచేయలేం. తాను పొందిన అవమానాలే ఆయన కవిత్వానికి బీజాలు. కుల మతాలపై కత్తి కట్టడానికి తన అనుభవాలే రాయకుండా ఉండలేని దశలో రాయబడిందే గబ్బిలం. వర్డ్స్ వర్త్ చెప్పినట్లు "శక్తివంతములైన భావాలు వాటంతట అవే పెల్లుబికి వచ్చుటయే ఉత్తమ కవిత్వం" అన్న మాటలు జాషువాకి అక్షరాలా అన్వయిస్తాయి.

**"కులమతాలు గీచుకొన్న గీతలు జొచ్చి**
**పంజరాన గట్టువడను నేను**
**నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు**
**తరుగులేదు, విశ్వనరుడ నేను"**

-- ఇదీ జాషువా అంటే. జాషువాపై ఒక ముద్రవేసి సంకుచితం చేయటం సరికాదన్న ద్వానా శాస్త్రిగారి అభిప్రాయం సమంజసమని చెప్పవచ్చు. గబ్బిలం కావ్యం ఆధారంగా జాషువా వ్యక్తిత్వాన్ని ఆయన భావజాలాన్ని అంచనా వేసేప్రయత్నమే ఈ వ్యాసం.

మొదటి పద్యంలోనే ''అరుంధతీ సుతుడు'', "కడుగొట్టుబిడ్డలు" అనే సమాసాలున్నాయి. వీటిని జాషువా కావాలనే ప్రయోగించాడనిపిస్తుంది. అరుంధతిని పూజిస్తారు. పెళ్ళయిన తరువాత అరుంధతీ నక్షత్రాన్ని చూపించి నమస్కరించమంటారు కానీ ఆమెకు పుట్టినవారిని మాత్రం నిర్లక్ష్యం చేస్తారు. నిరాధరిస్తారు. ఇదెక్కడి నీతి? అని జాషువ ప్రశ్న. "వశిష్ఠ పుత్రులు" అని ఎందుకనరు ? కావాలనే మమ్మల్ని అవమానిస్తున్నారని జాషువా దిగులు. జాషువా గబ్బిలం కావ్యాన్ని 1941లోనే రాశాడు. అప్పటికే జాషువాకి శ్రమదోపిడి, అట్టడుగు వర్గాల దోపిడీపై అవగాహన ఉంది. జాషువా మారుమూల ఉపాధ్యాయుడిగా ఉన్నా – ఆయన విజ్ఞాననేత్రం విశాలమైనది. నిశితమైనది. లేకపోతే.....

**వాని రెక్కల కష్టంచి లేనినాడు**
**సస్యరమ పండి పులకింప సంశయించు**
**వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు**
**భోజనము పెట్టు, వానికి భుక్తిలేదు**

– అనే పద్యం రాయలేడు. మార్క్సిజమ్‌లో గల శ్రమదోపిడి ఈ పద్యంలో స్ఫుర్తిస్తుంది. కష్టపడే వాడికి మిగిలేది శూన్యమన్న భావన జాషువాలో బలంగా ఉంది. అంటే జాషువా హృదయం దోపిడీ వ్యవస్థపై కుతకుతలాడిందని భావం. జాషువాకి రెండు నాల్కల పద్ధతి అంటే గిట్టదు. నీతులకి ఆచరణకీ పొంతన ఉండాలనే వ్యక్తి ఆయన. అందుకే "హృదయము లేని లోకము సుమీ యిది.." అని ఘంటాపథంగా ప్రకటించాడు. "శ్రీ గలవాని యాజ్ఞ"లో ఎవరూ పెదవి కదల్పలేరన్నాడు. అంటే ఈ దేశంలో సంపన్నులదే రాజ్యమన్నాడు. 'లోభి' అవతారమెత్తిన స్వాములు, ఫాదర్లు అట్టడుగు వర్గాల వారిని వాడుకొంటున్నారనీ, అబద్దాలు చెప్తున్నారనీ జాషువా ఆగ్రహం ప్రకటించాడు. జాషువా మానవతావాది. ఆ తర్వాతే దళిత వాది. ఆయనకి మానవత్వమే ముఖ్యం. మానవుడ్ని ఆరాదించమంటాడు. ఆదుకోమంటాడు లేకపోతే

''ప్రతిమల పెండ్లి సేయుటకు వందల వేల వ్యయించుగాని...

..... భాగ్యవిహీనులక్షుత్తులాఱునే" అనే పద్యం రాయలేడు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మినవాడు జాషువా. బొమ్మల పెళ్ళిళ్ళకంటే జీవమున్నవారికి ఒక మెతుకు వెయ్యడం దైవత్వం అని చాటిన మనిషి జాషువా.

ఈ సమాజంలో ఎదో ఒక మతానుమాయి కావాలి. లేదా సంపన్నుడు కావాలి. అప్పుడే ఆదరణ, గౌరవం కానీ జాషువా దీనికి వ్యతిరేకం. వ్యక్తిత్వానికి గౌరవం తప్ప సంపన్నతకీ, మతానికి కాదని జాషువా ఘంటాపథంగా చెప్పాడు....

**"కడుపు నిండిన భాగ్యవంతుడనుగాను...**
**దొరతనము సేయగా మతస్థుడను గాను"**

జాషువా నిర్భయత్వం గలవాడు. అనుకొన్నది ఖరాఖండిగా చెప్పగల ధైర్యం ఉంది. ఎవరేమనుకొన్నా వాస్తవాన్ని చెప్పాలన్న గుండె నిబ్బరం జాషువాది అందుకే....

**"పూజారి లేని వేళ విన్నవింపుము నాదు జీవితచరిత్ర"**

అనగలిగాడు. ఇలా చెప్పడం సాహసం. అంతేకాదు – విలక్షణం. ఇక్కడే జాషువా వ్యక్తిత్వం వికసించింది.

**"నాదు కన్నీటి కథ సమన్వయము సేయ**
**నార్ద్రహృదయంబు గూడ గొంతవసరంబు"**

అనటంలో జాషువా వ్యక్తిత్వం ప్రస్ఫుటమవుతుంది. గబ్బిలంలో అంటరానివాని కన్నీటి కథ. ఆ కథలో హిందువుల్ని బాధించే అంశాలున్నాయి. వాటిని అపార్థం చేసుకోకూడదనీ, అర్ద్ర హృదయం ఉండాలనీ, ఆ అర్ద్ర హృదయం ఉండటమే గబ్బిలం పాఠకుడికి యోగ్యత అనీ తెలుస్తుంది. మానవత్వానికి ఆర్ద్ర హృదయం ఒక చిహ్నం!

జాషువాకి మన కవులన్నా, మన పుణ్యక్షేత్రాలన్నా మక్కువ ఎక్కువ. అందరూ ముద్దు పళనిని నిందించారు. ఆమె రాసిన 'రాధికా సాంత్వనం' కావ్యాన్ని అసభ్య కావ్యమనీ, పచ్చి శృంగార కావ్యమనీ విమర్శించారు. మరి జాషువా అభిప్రాయం గమనించండి.

**"పచ్చపచ్చని ముద్దుపళని ముద్దులకైత**
**శృంగార రసము వర్షించువేళ"**

–అని ముద్దుపళనిని ప్రశంసించాడు. ఆడదైనంత మాత్రాన శృంగారం రాయకూడదా. అన్నదే జాషువా ప్రశ్న. శ్రీనాథుడు, ప్రబంధకవులు అతిగా శృంగారం రాయలేదా? వారిని కాదని ముద్దుపళనిని నిందించడం జాషవాకు ఇష్టంలేదు. పదకవి క్షేత్రయ్యను మెచ్చుకున్నాడు. జాషువా అస్పృశ్యత జాడ్యంపై కన్నెర్రజేసినవాడు. అందుకే వేమనను కొనియాడుతూ ఒక పద్యం రాశాడు. వేమన కూడా కులద్వేషాన్ని, కుల పీడనన్ని ఎండగట్టినవాడే. అందుకే మునిమాన్యుడయ్యాడు వేమన. వేమన ప్రతిశబ్దం శ్రవణపేయంగా భావసంపదతో ఉంటుందన్నాడు. కులభేదాల్ని, అంటరానితనాన్ని ఎప్పుడో ఖండించిన వేమన అంటే ఇష్టం ఉండడంలో ఆశ్చర్యం ఏముంది ?

జాషువా విశ్వనరుడు. మానవతావాది. ఎవరికి అన్యాయం జరిగినా సహించలేడు. పిరదౌసికి జరిగిన అన్యాయమే జాషువాని కావ్యం రాయించింది.

**"తొలి సారంగధరుడు వట్టి యపవాదున్నెత్తిపై దాల్చి**
**కత్తుల పాలైన విషాదగాథ వినలేదో నీవు....**
**...పలియైపోయిన రాజనందనుని...."**

అనే పద్యంలో జాషువా ఆర్ద్ర హృదయం ప్రతిబింబిస్తుంది. "రాజకుమారుడు కాబట్టి బలైపోతే ఏం? అనుకోలేదు. ఎవరైనా మనిషే గదా! జాషువా ముందుగా మనిషితనాన్ని ఆదరిస్తాడు. ఆ తర్వాతే ఏదైనా! అందుకే సారంగదరుడిది 'దౌర్భాగ్యం' అని సానుభూతి ప్రదర్శించాడు.

జాషువా ఈ నేలను ప్రేమించాడు. ఇక్కడి నదుల్ని ఆరాదించాడు. ఇక్కడి కవితా వైభవానికి, శిల్ప నైపుణ్యానికి, చారిత్ర ప్రభావానికి ఉప్పొంగిపోయాడు. "పరుల విద్యలు మెచ్చెదరీ గుణము నేడు మృగ్యం బు కదా" అనటంలో ఆంధ్రుల స్వభావంపై చురకవేశాడు. తన చిన్న గుడిసెను కూడా "కుటీరలక్ష్మి"గా భావించి సంతృప్తి చెందేవాడు జాషువా. "వేయి చేతుల పెనుకాపు" అనటంలో భూస్వామిపై గల నిరసనను గ్రహించవచ్చు. జాషువా విశిష్ట వ్యక్తిత్వం, ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వం గలవాడు. మానవతకు మరోపేరు జాషువా. తన పాఠకుల్ని ఆర్ద్ర హృదయుల్నిగా జేసే కవి జాషువా..


**...... పెంకె సాయికుమారి.**

## మంచిమాటల దర్పణం

**గ**ట్టుమీద చేప పిల్లని 'దీర్ఘాయుష్మాన్‌భవ' అని ఆశీర్వదించడం తప్పు.



తాగడానికి నీరు ఉందని తెలిస్తేనే మురికి నీటిని పారబొయ్యాలి.



నల్లని కోళ్లయినా తెల్లని గుడ్లే పెడతాయి



# బుద్ధుడు తర్వాత నాగార్జునుడే !!

**సనాతన సంప్రదాయాన్ని జీవిత పరమార్థంగా భావించి.. జీవించే బ్రాహ్మణకుటుంబంలో జన్మించిన ఒక వ్యక్తి ఆ సంప్రదాయపు వ్యతిరేకత నుంచి పుట్టిన మతంలో అత్యుత్తమ ఆచార్యుడిగా ఎదగడం చరిత్రలో నిలిచిపోయిన సంఘటన. తర తరాల సంప్రదాయాలను ఎదిరించి, సమాజ శాసనాలను ధిక్కరించి ప్రపంచానికి దశ, దిశ నిర్దేశం చేసిన ఆ వ్యక్తే ఆచార్య నాగార్జునుడు. బౌద్ధమతాచార్యుల్లో ఒక విశిష్టస్థానం పొందిన నాగార్జునుడు పుట్టింది మన రాష్ట్రంలోనే.....**

నాగార్జునుడు చిన్ననాటి జీవితం గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. క్రీస్తుపూర్వం 150 సం॥లో నాగార్జునుడు పుట్టాడని అందుబాటులో ఉన్న చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది.

నాగార్జునుడి జీవితానికి సంబందించిన రెండు జీవిత చరిత్రలు ఉన్నాయి. ఒకటి టిబెటన్ భాషలోను, మరొకటి చైనీస్ భాషలోను లభించాయి.

బహుళ ప్రచారంలో ఉన్న నాగార్జునుడి ఆత్మకథ ప్రకారం నాగార్జునుడు పుట్టిన ఏడేళ్లకే మరణిస్తాడని జ్యోతిష్యశాస్త్రపండితులు పేర్కొన్నారు. తమ కొడుకు మరణాన్ని కళ్ళారా చూడలేమని భావించిన తల్లిదండ్రులు, నాగార్జునుడిని ఒక పనివాడికి ఇచ్చి కాశీకి తీర్థయాత్రకు పంపుతారు. కాశీకి వెళ్ళే క్రమంలో నాగార్జునుడు నలందకు వెళ్తాడు. అప్పటికి బౌద్ధమతానికి ఉత్తర భారతదేశంలో మంచి ఆదరణలభిస్తోంది.



అక్కడ నాగార్జునుడికి సరాహ అనే బౌద్ధ సన్యాసి కనిపిస్తాడు. మరణానికి విరుగుడు బౌద్ధంలోకి మారటమేనని చెబుతాడు. నాగార్జునుడు బౌద్ధమతంలోకి మారిపోతాడు.

ఆ సమయంలో బౌద్ధమతంలో హీనయాన, మహాయాన అనే రెండు శాఖలు ఉన్నాయి. నాగార్జునుడు ఈ రెండింటిలోను ప్రావీణ్యం సాధించాడు. ఆ తర్వాత మళ్ళీ తన జన్మస్థలమైన నాగార్జున కొండకు తిరిగి వచ్చేశాడు. కొద్ది కాలం పోయిన తర్వాత మగధలో కరువు వచ్చింది. బౌద్ధ భిక్షువులకు విపరీతమైన కష్టాలు మొదలయ్యాయి.

ఈ కష్టాలను తీర్చటానికి మగధకు రమ్మని సరాహ పిలుస్తాడు. నాగార్జునుడు అక్కడకు వెళ్తాడు. బౌద్ధ సంఘాలకు అవసరమైన సౌకర్యాలు సమకూరుస్తాడు. ఆ సమయంలోనే ఇనుమును బంగారంగా మార్చే పరుసవేది విద్యను నేర్చుకుంటాడు. అందరి అవసరాలూ తీరుస్తాడు. ఆ తర్వాత నలందాలో స్థిరపడతాడు. ఈ కథలో సత్యాసత్యాలను పక్కన పెడితే – నలందా విశ్వవిద్యాలయాన్ని నాగార్జునుడు స్థాపించాడని కొన్ని ఆధారాలు చెబుతున్నాయి.

## నాగార్జునుడి సూత్రాలివి...



నాగార్జునుడిది మధ్యేమార్గం. ఇది హీనయాన, మహాయానల కన్న భిన్నమైనది. దీనిలో చైనాలో సన్‌లున్‌గా వ్యవహరిస్తారు.

నాగార్జునుడు దాదాపు 16 మహా గ్రంథాలు రాశాడని నిపుణులు చెబుతారు. దీనిలో కొన్ని రసాయన శాస్త్రానికి, ఆయుర్వేదానికి సంబందించినవి కూడా ఉన్నాయి. వీటి ఆధారంగా చూస్తే నాగార్జునుడు బహుముఖ ప్రజ్ఞాశాలి అని అర్థమవుతుంది.

బౌద్ధమతానికి నాగార్జునుడు ఇచ్చిన బహుమతి నియత్ అనే సిద్ధాంతం. దీని ప్రకారం మానవుడు ఎవరో ఒకరిపై ఆధారపడే వాడే.

మనిషి పుట్టుక కూడా కొన్ని కారాణాలు ఉంటాయి. ఈ ప్రకృతిలో సహేతుకమైన కారణం లేని స్థితి ఏది ఉండదు. అంతే కాకుండా రెండు రకాల సత్యాలు ఉంటాయి. మొదటిది ప్రకృతి ద్వారా వచ్చిన సత్యం. రెండోది ఎప్పటికప్పుడు మారే సత్యం. ఈ రెండింటికి మధ్య సమతౌల్యం ఏర్పడినప్పుడు - ఎటువంటి సంఘర్షణఉండదు. వాటి మధ్య అంతరం ఉన్నప్పుడు ఇబ్బందులు ఏర్పడతాయి.

బౌద్ధమతంలో బుద్ధుడి తర్వాత అంత విశిష్ఠ స్థానం నాగార్జునుడిదే. అంత సముచిత స్థానం పొందిన నాగార్జునుడి సూత్రాలు ఇప్పటికి అందరికి ఆదర్శంగానే నిలుస్తాయి.

## ఏమున్నది గర్వకారణం ?

**ఆ**ంధ్ర రాష్ట్రం నుంచి ఒక టూరిస్టు బృందం జైపూర్ వెళ్లింది. అక్కడి గైడ్ ప్యాలెస్‌లన్నిటినీ వివరంగా చూపించి, వాటి చరిత్రలు చెబుతున్నాడు. ఈ మధ్య బిల్‌క్లింటన్‌గారు, వారి అమ్మాయి మెచ్చుకున్న భవనాలను ప్రత్యేకంగా చూపించాడు. ఒక ప్యాలెస్‌ని చూపించి "దీన్ని నిర్మించి 500 సంవత్సరాలైంది. ఇప్పటి వరకూ ఒక్క రాయిని మార్చలేదు. ఒక్క దర్వాజానిగాని, కిటికీని గాని రిపేర్ చెయ్యలేదు. ఆఖరికి రంగులూ, సున్నాలు కూడా అప్పటివే' అన్నాడు గైడ్ గర్వంగా.

అందులో విచిత్రమేముంది ? ఆ రాజుగారెవరో మా ఇంటి ఓనర్‌లాంటివాడై వుంటాడు" అందోకావిడ టూరిస్టు బృందంలోంచి....

## ఋషిద్ధం

**ఒ**క గుహలో ముగ్గురు ఋషులు ఘోరంగ తపస్సు చేస్తున్నారు. ఎన్నో ఏళ్ళు గడిచిపోయాయి. ఒక రోజు గుర్రం ఒకటి గిట్టల చప్పుడు చేసుకుంటూ గుహ పక్కనించి వెళ్ళింది. "నల్లమచ్చల తెల్ల గుర్రం" అన్నాడొక రుషి అర్ధనిమీలిత నేత్రాలతో. ఒక ఏడాది నిశ్శబ్దంగా గడిచింది. "కాదు తెల్ల మచ్చల నల్ల గుర్రం" అన్నాడు రెండో రుషి మొదటాయన మాటతో విభేదిస్తూ, రెండేళ్ళు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి. గుహ ముఖద్వారం పక్కగా కూర్చున్న మూడో రుషి కన్నెర్రచేసి "మీరిట్లా అస్తమానం ప్రతి చిన్న విషయానికి వాదోపవాదాలకు దిగితే నాకు పరమ డిస్టర్బెన్స్‌గా వుంది" అని దండకమండలాలతో వేరే గుహవైపు విసవిసా నడిచాడు.



# అబద్ధమాడని నోరు

.... మల్లాది వెంకటకృష్ణమూర్తి

విశ్వేశ్వరరావు బిజినెస్ ట్రిప్ అనుకోకుండా రద్దయింది. ఆఫీస్ పని మీద హైదరాబాద్ నుంచి వరంగల్‌కి వెళ్ళాడు. ఐతే వరంగల్ విశ్వేశ్వరరావు పనిచేసే ఫ్యాక్టరీ నుంచి సరుకుని దిగుమతి చేసుకోదలచిన వ్యాపారస్తుడు కోయంబత్తూరు నుంచి ఇంకా తక్కువ ధరకి దిగుమతి చేసుకుంటున్నాడని తెలిసింది. ఆ ధరకి తాము సరఫరా చేయలేం కాబట్టి విశ్వేశ్వరరావు ముందనుకున్నట్లుగా ఓ రోజు వుండకుండా ఓ గంటలో కారెక్కి డ్రైవర్‌కి చెప్పాడు.

"హైదరాబాద్ పోనీ" ఇంటి నుంచి బయలుదేరిన ఏడో గంటకి విశ్వేశ్వరరావు తిరిగి వెనక్కి బయలుదేరి తొమ్మిదో గంటకి ఇంటికి చేరుకున్నాడు. విశ్వేశ్వరరావు కారు దిగాక డ్రైవర్ ఆఫీసుకి కారులో వెళ్లిపోయాడు.

డోర్ బెల్ కొట్టాడతను. ఒకటికి మూడుసార్లు కొడితే కానీ విశ్వేశ్వరరావు భార్య సుమతి తలుపు తీయలేదు.

"అదేమిటి? అప్పుడే వచ్చేసారు? ఆశ్చర్యపోయింది.

"పనికాలేదు" బ్రీఫ్‌కేస్‌తో లోపలికి నడుస్తూ అడిగాడు "బెల్ వినపడలేదా?"

"వినపడింది బాత్‌రూంలో వున్నాను"

దుస్తులు మార్చుకుని విశ్వేశ్వరరావు టీవి ముందు కూర్చున్నాడు. హిస్టరీ ఛానెల్‌లో ఎనిమిదికి వచ్చే "మాడ్రన్ మార్వలెస్" కార్యక్రమం చూడసాగాడు. ఆ ఛానల్‌లో అది అతని ఫెవరేట్ ప్రోగ్రాం. చాక్లెట్ల తయారీ గురించి చూపిస్తున్నారు. రాత్రి భోజనం అయ్యాక పళ్ళు బ్రష్ చేసుకోవడానికి బాత్‌రూంలోకి వెళ్ళిన విశ్వేశ్వరరావు వాష్ బేషిన్ మీద ఓ పక్క వున్న కట్టుడు పళ్లని చూసి ఆశ్చర్యపోయాడు. పై దంతాల కట్టుడు పళ్లవి.

"సూ" పిలిచాడు భార్యని.

"ఏమిటి"? అని అడిగింది సుమతి వచ్చి

"ఇవెవరివి"? అడిగాడు.

వాటిని చూసి క్షణకాలం సుమతి మోహం పాలిపోవడం గమనించాడు విశ్వేశ్వరరావు.

"మా అమ్మవి మర్చిపోయినట్లుంది"

"మీ అమ్మ ఏలూరు నుంచి ఎప్పుడు వచ్చింది?"

"ఉదయం మీరెళ్ళాక వచ్చింది. మా అక్కయ్య ఇంటికి నిన్న వచ్చిందట"

"పాపం! భోజనం ఎలా చేస్తుంది ? తీసుకెళ్లి ఇద్దామా?"

"రేపివ్వచ్చులెండి" వారించింది సుమతి

మర్నాడు విశ్వేశ్వరరావు నిద్రలేచాక బాత్‌రూంలోకి వెళ్లి చూసే సరికి ఆ పళ్ళులేవు.

"ఏమయ్యాయి ఆ పళ్ళు?"అడిగాడు

"మా అక్కయ్య కొడుకు పొద్దున్నే వచ్చి తీసుకెళ్లాడు"

"నాకు శ్రమ తప్పింది. ఆఫీసుకు వెళుతూ దారిలో ఆగి ఇద్దామనుకున్నాను" చెప్పాడు విశ్వేశ్వరరావు.

ఆ రోజు ఆఫీసుకు వెళ్ళాక అతను తన బాస్‌ని కలిసి వరంగల్ ట్రిప్ విశేషాలు చెప్పాడు.

"కోయంబత్తూరు సరుకులో నాణ్యత వుండదని చెప్పినా వినలేదు. మోసపోయాక తెలుస్తుంది లెండి. డాక్టర్ అరుగుదలకి పీచు పదార్థం తినమంటే, ఇలాంటి వాడే వెనుకటికికొకడు కొబ్బరి పీచుతో భార్యని కూర చేయమన్నాట్ట"

ఆ మాటలకి ఫక్కున నవ్వాడు బాస్.

ఆయన పై పలు వరుస స్థానంలో బోసిగా చిగుర్లు కనిపించగానే విశ్వేశ్వరరావు కెవ్వున అరిచాడు. ●●●

# ప్లాస్టిక్ విషం!

.... డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు

నీలగిరి వ్యాపారుల్లో అక్కడి ప్రజలలో ఈ మార్పు సాధ్యమైనపుడు మిగిలిన పట్టణాలు, గ్రామాలలో ఎందుకు సాధ్యం కాదు?! తప్పకుండా సాధ్యమే. కావాల్సింది ప్రజలలో అవగాహన కల్పించటం.

ప్లాస్టిక్ పదార్థాల మీద అవగాహన పెంచుదాం. ఆ ప్లాస్టిక్ మానవాళికి తెస్తున్న ముప్పును వివరిద్దాం. మన ప్రాంతాలను ప్లాస్టిక్ వాడని ప్రాంతాలుగా ప్రకటిద్దాం.



**ప్లా**స్టిక్‌ని కనుక్కున్నప్పుడు ఒక మహత్తర సృష్టి జరిగిందుకుని పొంగిపోయిన పరిశోధకులు తాము మానవాళికి విషం అందించామని తెలిసి కుంగిపోక తప్పదు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌లే. ప్రతి ఇంటి నిండా ప్లాస్టిక్ సామాగ్రి. బకెట్లు, మగ్గులు, బిందెలు, నీటి సీసాలు, ఇలా ఒకటేమిటి.. వంట ఇంటినిండా ప్లాస్టిక్ పరికరాలే. షాపింగ్‌కి వెళితే తిరిగి వచ్చేది ప్లాస్టిక్ సంచులతోనే. అంతగా ప్లాస్టిక్ తో మమేకమైంది ప్రజల జీవనం. పైగా జనం అధికంగా చేరే చోట ప్లాస్టిక్‌ల సమస్య మరింతగా పెరిగింది. పర్యాటక ప్రాంతాలన్ని ప్లాస్టిక్‌తో నిండిపోతున్నాయి.

ప్లాస్టిక్‌ల తయారికి వాడే పదార్థాలన్నీ విషపూరితమైనవి. బెంజీన్, వినైల్ క్లోరైడ్ అనే ప్లాస్టిక్‌లోవున్న రెండు పదార్థాలు క్యాన్సర్ కారకాలు. ఇక మిగిలిన పదార్థాలైన హైడ్రోకార్బన్‌లు, ఇతర వాయువులు పర్యావరణానికి ప్రమాదమైనవి. ప్లాస్టిక్ వస్తువులు తయారు చేసేటప్పుడు ఎథిలిన్ ఆక్సైన్, బెంజీన్, గ్జైలీన్‌లు విడుదలవుతాయి.

ఆ విష పదార్థాలు పర్యావరణవ్యవస్థను దెబ్బతీయటమే కాక గర్భస్థ శిశువుల మీద ప్రభావం చూపి వారికి శారీరక లోపాలను కలుగచేస్తాయి. పెద్ద పిల్లల రోగనిరోధక వ్యవస్థను పాడుచేస్తాయి. చాలా మందిలో క్యాన్సర్ తెస్తాయి. ఆ వ్యర్థాలు నాడీ వ్యవస్థమీద, మూత్రపిండాల పనితీరు మీద ప్రభావం చూపుతాయని అధ్యయనంలో తేలింది. వాటిని పీల్చటం ద్వారా రక్తం కూడా దెబ్బతింటుంది.

ఇటీవల కాలంలో 'ప్లాస్టిక్ రిసైక్లింగ్' అనేది మొదలుపెట్టారు. అంటే ఒకసారి ఉపయోగించిన ప్లాస్టిక్‌లను కరిగించి మరల ప్లాస్టిక్ వస్తువుల తయారీకి వాడటాన్ని రీసైక్లింగ్ అంటారు. రీసైక్లింగ్ అనేది మంచి ఆలోచనేకాని దీనివల్ల మరిన్ని అనార్థాలు వున్నాయి. రిసైక్లింగ్ సమయంలో మరిన్ని వ్యర్థ వాయువులు విడుదలై మరింత ప్రమాదం కలిగిస్తున్నాయి.

ఇది కలియుగం అంటారు కాని నిజానికి యిది ప్లాస్టిక్ యుగం.

ఈ ప్లాస్టిక్ ప్రభావాలు తీవ్రమై అనుభవించే తరం వస్తుంది. వారిది అసలు సిసలు కలియుగం. ఎందుకంటే ఈ ప్లాస్టిక్ యుగంలో యింకా అక్కడక్కడ ప్లాస్టిక్‌లను వ్యతిరేకించేవారు, ఉపయోగించనివారు కనిపిస్తున్నారు. ఇటీవల నీలగిరిని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రకటించారు. ఇది ఒకరకమైన స్వచ్ఛంద స్పందన. తమ ప్రకృతి రమణీయత పోతున్నదన్న బాధతో నీలగిరివాసులు చేసుకున్న ఏర్పాటు. దీనిని స్థానిక వ్యాపారులు పాటిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులలో పెట్టి ఇవ్వటం మానేసి కాగితం సంచులతో యిస్తున్నారు.

నీలగిరి వ్యాపారుల్లో అక్కడి ప్రజలలో ఈ మార్పు సాధ్యమైనపుడు మిగిలిన పట్టణాలు, గ్రామాలలో ఎందుకు సాధ్యం కాదు?! తప్పకుండా సాధ్యమే. కావాల్సింది ప్రజలలో అవగాహన కల్పించటం. మున్సిపల్ చెత్తవేసే ప్రదేశం ఎంత భయానకంగా వుంటుందో తీసుకవెళ్లి స్కూల్ పిల్లలకు చూపించగలిగినా, ఆ చెత్తను సంబంధించిన ఫోటోలను స్కూళ్లలో ప్రదర్శించగలిగినా యువతలో ప్లాస్టిక్ వాడకం మీద వ్యతిరేకత వస్తుంది.

ఇక అక్కడ నుండి వారే దానిని సరిదిద్దటం మొదలుపెడుతారు.

కాబట్టి ప్లాస్టిక్ పదార్థాల మీద అవగాహన పెంచుదాం. ఆ ప్లాస్టిక్ మానవాళికి తెస్తున్న ముప్పును వివరిద్దాం. మన ప్రాంతాలను ప్లాస్టిక్ వాడని ప్రాంతాలుగా ప్రకటిద్దాం.

●●●

# మీకు తెలియని కొన్ని నిజాలు

- ఇప్పటివరకు ఎన్నికైన అమెరికా అధ్యక్షుల్లో 1857 నుండి 1861 వరకూ పదవీ బాధ్యతలు నిర్వర్తించిన జేమ్స్ బుచానన్ మాత్రమే బ్రహ్మచారి.
- భూమ్మీద వృక్ష జాతుల్లో 85 శాతం సముద్రంలోనే ఉన్నాయి.
- ఇప్పుడు మనిషి పెంపకానికి మచ్చికైన జంతువులన్నీ 4000 సంవత్సరాల క్రితం మచ్చికైనవే. అప్పటి నుండి కొత్తగా ఏ జంతువూ మనిషికి మచ్చిక కాలేదు.
- ఆస్ట్రేలియాలో ఒక జాతి వానపాము పది అడుగుల పొడవు పెరుగుతుంది.
- ఒక ఆవును మెట్లు ఎక్కించడం సులభమే. కాని దించడం దాదాపు అసాధ్యమట.
- అమెరికన్ జనాభాలో 69 శాతం ఇంటర్‌నెట్ ఉపయోగిస్తే, ఇండియాలో కేవలం 5.5 శాతం మాత్రమే ఉపయోగిస్తారు.
- వెనిజులాలోని ఏంజెల్ జలపాతం ప్రపంచంలోకెల్లా ఎత్తైన జలపాతం. ఇది 3212 అడుగుల నుండి క్రింద పడుతుంది.
- భారత దేశంలో సంవత్సరానికి మూడు వందల మిలియన్ల సినిమా టిక్కెట్లు అమ్ముడవుతాయని అంచనా.
- లియోనార్డో డావిన్సీ ఒక చేత్తో రాస్తూ అదే సమయములో మరో చేత్తో బొమ్మ గీయగలిగేవాడు.
- సౌదీ అరేబియాలో భర్తలు కాఫీ ఇవ్వడానికి నిరాకరిస్తే భార్యలు విడాకులు ఇవ్వవచ్చు.
- ఒక బొద్దింక తల లేకుండ పది రోజులు బతకగలదు.
- తల అడ్డంగ ఊపితే భారత దేశంలో "కాదు" అని అర్థం. కానీ శ్రీలంకలో ఇదే భంగిమకు "అవును" అని అర్థం.
- మన చేతి వేళ్లలో బొటన వ్రేలు అన్నింటికన్న నెమ్మదిగా పెరుగుతుంది. మధ్యవేలు వేగంగా పెరుగుతుంది.
- మాల్బోరో సిగిరెట్ల కంపెనీ మొదటి యజమాని ఊపిరి తిత్తుల కాన్సర్‌తో మరణించాడు.
- ఒక మనిషి ఆకలితో కన్నా, నిద్రలేమి వల్ల తొందరగా మరణిస్తాడు.
- యుద్ధ సన్నివేశాల్ని చిత్రీకరించేటపుడు బ్రూసులీ ఎంత వేగంగా కదిలే వాడంటే, ఆ వేగాన్ని చిత్రించేందుకు కెమెరాలో ఫ్రేమ్‌లు కదిలే వేగాన్ని సరిచేయవలసి వచ్చేది.
- స్పెయిన్‌లో కోల్గెట్ టూత్ పేస్టు కంపెనీ ప్రచారానికి చాలా ఇబ్బంది పడింది. ఎందుకంటే స్పానిష్ బాషలో కోల్గెట్ అంటే 'వెళ్ళి ఉరేసుకో' అని అర్థం వస్తుంది.
- చంద్రుడు తిన్నగా మన తలపై ఉన్నప్పుడు మన బరువు కొద్దిగా తగ్గుతుంది.
- నత్తలు వరుసగా మూడేళ్ళు నిద్రపోగలవు.

●●●